ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

బుధవారం | 22-07- 2026 | సంపుటి: 17, సంచిక: 109, | నిజామాబాద్, | పేజీలు: 12, | వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ



హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులపై

## సీఎం సీరియస్

ప్రతి నెలా పురోగతిని స్వయంగా సమీక్షిస్తానని స్పష్టం

అలసత్వం ప్రదర్శించే అధికారులపై సస్పెన్షన్ హెచ్చరిక

భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన

వికారాబాద్, జులై 21 (ప్రజాకలం) : వికారాబాద్ జిల్లా హకీంపేటలో ప్రతిష్ఠాత్మకం గా చేపట్టిన ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన ఈ ప్రాజెక్టులో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావులేదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి, ఇక నుంచి ప్రతి నెలా స్వయంగా పనుల పురోగతిని సమీక్షిస్తానని ప్రకటించారు. అవసరమైతే నెల లో ఒకరోజు నిర్మాణ స్థలంలోనే బస చేసి పనులను పరిశీలిస్తానని చెప్పడం అధికార యంత్రాంగానికి స్పష్టమైన హెచ్చరికగా మారింది. శాసన, ఉన్నతాధికారులతో కలిసి హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి, అక్కడ నిర్మాణం లో ఉన్న ఇంజనీరింగ్ కళాశాల, మెడికల్ కాలేజీ, నర్సింగ్ కళాశాల, వెటర్నరీ కళాశాల, ఫిజియో థెరపీ-పారా మెడికల్ కళాశాలలతో పాటు విద్యార్థుల హాస్టళ్ల నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

తరువాయి 2వ పేజీలో...

ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుల

# మెరుపు ధర్నా

విద్యార్థులపై లాఠీచార్జి నిరసిస్తూ బైఠాయింపు

- ధర్నాలో పాల్గొన్న ఖర్గే, రాహుల్, ప్రియాంక, సీఎంలు డీకే, సతీశన్ తదితరులు
- నేతల అరెస్టు.. రాహుల్‌ను లాక్కెళ్లిన పోలీసులు.. విపక్ష నేతకు స్వల్ప గాయాలు



న్యూఢిల్లీ, జూలై 21: దేశ రాజధాని ఢిల్లీ వరుసగా రెండో రోజూ దద్దరిల్లింది. నీట్ తదితర పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ వ్యవహారం రాజధానిని కుదిపేసింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్, మిత్రపక్షాలు మంగళవారం సాయంత్రం అనూహ్యంగా 7, లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నివాసాన్ని ముట్టడించాయి. మూడు గంటలకు పైగా కొనసాగిన ఈ మెరుపు ధర్నాతో కేంద్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, కేరళ, కర్ణాటక ముఖ్యమంత్రులు వీడీ సతీశన్, డీకే శివకుమార్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఎన్సీపీ నేత సుప్రియా సూలే, ఇండియా కూటమి పార్టీలకు చెందిన పలువురు ఎంపీలు ముట్టడిలో పాల్గొన్నారు. ముందస్తు సమాచారం లేకుండా అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామంతో పోలీసులు, భద్రతా సిబ్బంది ఖంగుతిన్నారు. ధర్నా విరమించాలంటూ కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వచ్చి కాంగ్రెస్ నాయకులను అభ్యర్థించారు. అందుకు వారు సమ్మతించకపోవటంతో, పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్‌గాంధీ ముఖం, చేతుల మీద స్వల్ప గాయాలయ్యాయి. ఈ నిరసన ప్రణాళికను కాంగ్రెస్ నాయకత్వం

తరువాయి 2వ పేజీలో...



పేపర్ లీక్ బాధ్యులను అత్యంత కఠినంగా

## శిక్షిస్తాం

పిల్లలను రెచ్చగొట్టడం సరికాదు

ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 21: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అత్యంత ఘోరమని, మహాపాపమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ బాధ్యులను ప్రభుత్వం ఇప్పటికే కటకటాల్లోకి నెట్టిందని తెలిపారు. నిరసనలు చేపడుతున్న పిల్లలను రెచ్చగొట్టవద్దని, యువతను సరైన మార్గంలో నడిపించే అంశంలో సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. లీకేజీ బాధ్యులను అత్యంత కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్యను నివారించేందుకు పార్టీలకతీతంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ప్రశ్నపత్రాల లీకేజీలను నివారించడమనేది రాజకీయ అంశం కాదని జాతీయ బాధ్యత అని పేర్కొన్నారు. మంగళ్ మిలన్ పేరిట న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడారని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు విలేకరులకు వెల్లడించారు. "ప్రశ్నపత్రం లీకేజీ అంశం బయటకు వచ్చిన వెంటనే స్పందించిన ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి, 13 మందిని అరెస్టు చేసింది విద్యార్థుల

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్





కరోనా తరహాలో సూపర్ ఎల్‌నినోను

## ఎదుర్కొందాం

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వరి సాగు మానుకుని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలి

35 శాతం వర్షపాతం లోటుతో అప్రమత్తంగా ఉండాలని సూచన

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 21 (ప్రజాకలం) సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని కరోనా మహమ్మారి తరహాలో అత్యంత అప్రమత్తతతో ఎదుర్కోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రైతులు వరి సాగును పూర్తిగా నివారించి, తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. కోరుట్ల నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి, ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి పరిస్థితులను సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటికే 35 శాతం వర్షపాతం లోటు నమోదైందని, భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గుతున్నాయని తెలిపారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలున్నాయని వాతావరణ అంచనాలను ప్రస్తావించారు. రైతులు చిరుధాన్యాలు, పొద్దుతిరుగుడు, కందులు, పెసర్లు, మినుములు, పప్పుధాన్యాలు, కూరగాయలు, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయాలని సూచించారు. వరి సాగు చేస్తే చివరి దశలో నీటి కొరతతో తీవ్ర నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోయాయని, ఆగస్టులో కూడా వర్షాలు కురవకపోతే సాగునీటితో పాటు తాగునీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముందని తెలిపారు. ప్రతి నీటి బొట్టును పొదుపుగా వినియోగించాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు,

తరువాయి 2వ పేజీలో...

గోదావరిలో నీళ్లున్నా

## ఎత్తిపోస్తలేరు

- దేవాదులపై సీఎంకు, మంత్రులకు అవగాహన లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు 2



నీట్ నిందితులను

## రక్షిస్తున్న కేంద్రం

శాంతియుత దీక్షల భగ్నం ప్రజాస్వామ్య విరుద్ధం

సోనమ్ వాంగ్ చుక్ ఆరోగ్యంపై కేంద్రమే భాధ్యత వహించాలి

రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

హైదరాబాద్‌లో సీజేపీ మద్దతుదారులు, విద్యార్థుల ఆందోళన

ఖైరతాబాద్, జూలై 21 : శాంతియుత దీక్షలను భగ్నం చేయటం ప్రజాస్వా మ్య విరుద్ధమని, వేలాది మంది నీట్ విద్యార్థుల భవితవ్యంతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడటం సరికాదని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి మండిపడ్డారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుత దీక్ష చేపట్టిన సోనమ్ వాంగ్ చుక్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి

తరువాయి 2వ పేజీలో...

కాళేశ్వరం మరమ్మతులు ఎందుకు

## చేయడం లేదు?



- నాలుగుసార్లు రైతుబంధు ఎగ్గొట్టిన ప్రభుత్వమిది
- వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైంది?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

లక్షెట్టిపేట, జులై 21 (ప్రజాకలం): సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రైతులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని, రైతులు చనిపోయినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలకు ముందు చెప్పిన వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. 32 నెలలు దాటినా ఇప్పటికీ రైతులకు న్యాయం చేయడం లేదని, కాళేశ్వరం మరమ్మతులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. నాలుగుసార్లు రైతు బంధు ఎగ్గొట్టిన సీఎం రేవంత్ ప్రభుత్వానికి, రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం అంకత్‌పల్లిలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సుకు ఆయన హాజరయ్యారు. పిడుగుపాటుతో మరణించిన రైతుల కుటుంబాలను పరామర్శించి పార్టీ తరఫున రూ. 5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రైతులు నచ్చిపోతున్నా రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు చెప్పిన వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు. 32 నెలలు దాటినా ఇప్పటికీ రైతులకు న్యాయం చేయడం లేదని, కాళేశ్వరం మరమ్మతులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టులను బాంబులతో పేల్చిన వారికి సాగునీటి విలువ ఎలా తెలుస్తుందని విమర్శించారు. నిరుద్యోగులకు రేవంత్ దొరికితే ఉరికిచ్చి కొడుతారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌కు రెండే తెలుసునని ఒకటి ఓట్లు.. రెండు తిట్లు అని ఎద్దేవా చేశారు. మాది ఏ జాతి అని ప్రశ్నించే రేవంత్‌కు మేమిచ్చే సమాధానం ఒక్కటే, మాది తెలంగాణను ప్రేమించే జాతి అని స్పష్టం చేశారు. ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన జాతి నీదని, ఎమ్మెల్యేలను నోట్లతో కొనే జాతి నీదని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రజలకు వివరించారు.

తరువాయి 2వ పేజీలో...



# ఢిల్లీలో కాంగ్రెస్ నాయకుల మెరుపు ధర్నా

మొదటి పేజీ తరువాయి...

అత్యంత రహస్యంగా ఉంచింది. లాఠీచార్జ్‌లో గాయపడి ఢిల్లీలోని వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్ తదితర కాంగ్రెస్ నేతలు మంగళవారం ఉదయం పరామర్శించారు. అక్కడి నుంచి ఖర్గే నివాసానికి వెళ్లారు. మంగళవారం ఖర్గే జన్మదినం కావటంతో ఆయనను అభినందించారు. అక్కడి నుంచి విజయ్‌చౌక్‌కు ర్యాలీగా వెళ్లి అక్కడ నిరసన తెలపాలన్నది కాంగ్రెస్ ఆలోచన. అయితే, ఈ విషయం బయటకు తెలియటంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ ప్రణాళిక ప్రకారమే ముందుకెళ్తే పోలీసులు అడ్డుకునే అవకాశాలే ఉన్నాయని తెలియటంతో.. కాంగ్రెస్ నేతలు ప్రణాళిక మార్చారు. ఖర్గే నివాసానికి 2.3 కి.మీ.ల దూరంలో ఉండే ప్రధాని మోదీ నివాసం వద్దకు వెళ్లి మెరుపు ధర్నాకు దిగాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎంపీలను ఖర్గే నివాసానికి పిలిపించారు. విషయం తెలిసి ఎంపీలు సైతం ఆశ్చర్యపోయారు. కేరళ సీఎం సతీశన్, కర్ణాటక సీఎం శివకుమార్ సైతం హుటాహుటిన వచ్చారు. ఖర్గే నివాసం నుంచి బయటకు వచ్చిన కాంగ్రెస్ నేతలు అక్కడి నుంచి బయల్దేరి, ప్రధాని నివాసం వద్దకు వచ్చి అక్కడ అకస్మాత్తుగా బైఠాయించారు. అది భద్రతపరంగా అత్యంత సున్నితమైన ప్రాంతం కావటంతో.. ఈ హఠాత్ పరిణామంతో పోలీసు సిబ్బంది నివ్వెరపోయారు. ధర్నాకు దిగిన కాంగ్రెస్ నేతలు.. విద్యార్థులపై దమనకాండకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజల స్వేచ్ఛపై ప్రభుత్వం ఆంక్షలను అమలు చేస్తుందనటానికి నిదర్శనంగా తమ చేతులను జిప్ టైలతో బంధించుకున్నారు. 'దేశ యువత భవిష్యత్తును నాశనం చేశారు. విద్యార్థులపై దాడి అంటే ప్రతి భారతీయ కుటుంబంపై దాడి చేయడమే. మోదీ, అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలి. ప్రతి దేశభక్తుడైన భారతీయుడూ ఈ పోరాటంలో కలిసిరావాలి' అని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. ఎటువంటి పర్యవసానాలు, జవాబుదారీతనం లేకుండా తప్పించుకోవచ్చని మోదీ భావిస్తున్నారుగానీ.. ఈసారి అలా జరగదని హెచ్చరించారు. 'విద్యార్థుల మీద జరిపిన దారుణమైన లాఠీచార్జికి ఈ పిరికిపంద, నియంతృత్వ ప్రభుత్వం జవాబు చెప్పాలి. యువతకు మోదీ, అమిత్‌షా ద్రోహం చేశారు. వారు రాజీనామా చేయాలి' అని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ధర్నాతో ప్రధాని నివాసానికి వెళ్లే మార్గాలన్నింటినీ పోలీసులు బారికేడ్లతో మూసివేశారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

**రాహుల్‌తో జితేంద్రసింగ్ చర్చలు**

పరిస్థితి తీవ్రతను గ్రహించిన కేంద్ర ప్రభుత్వం.. విపక్షాలను శాంతింపజేసేందుకు రంగంలోకి దిగింది. దాదాపు 20 నిమిషాల నిరసన తర్వాత, ప్రధానమంత్రి కార్యాలయ(పీఎంవో) సహాయమంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ వచ్చి రాహుల్‌గాంధీతో చర్చలు జరిపారు. అయితే, రాహుల్ మాత్రం పట్టు వీడలేదు. 'యువత భవిష్యత్తును నాశనం చేసినందుకు ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాల్సిందే' అని డిమాండ్ చేశారు. రాయబార యత్నాలేవీ ఫలించకపోవడంతో మంత్రి జితేంద్ర సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. చర్చలు ఫలించలేదని, తాము రాత్రంతా ఇక్కడే ఉండి, ధర్నా జరుపుతామని కాంగ్రెస్ నేతలు ప్రకటించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా మూడు కీలక డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది.

1. నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి.
2. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేయించినందుకు, అక్రమ కేసులు బనాయించినందుకు హోంమంత్రి అమిత్ షా బేషరతుగా క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకోవాలి.
3. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో నీట్ అంశంతో పాటు దేశంలో విద్యావ్యవస్థ వైఫల్యాలపై పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేసింది.

అయితే, కేంద్రమంత్రి జితేంద్రసింగ్ దీనికి భిన్నమైన వాదన వినిపించారు. 'నీట్ పరీక్షకు సంబంధించిన అంశాలపై పార్లమెంటులో చర్చకు ప్రభుత్వం అంగీకరిస్తే తాను వెంటనే ధర్నాను విరమిస్తానని రాహుల్ గాంధీ చెప్పారు. మా ప్రభుత్వ అగ్రనాయకత్వం అనుమతితో కొద్దిసేపట్లోనే ఆయన డిమాండ్‌కు ఆమోదం తెలిపాం. నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనే హామీని రాహుల్‌గాంధీకి నేను స్వయంగా తెలిపాను. కానీ, ఆయన మాట మార్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే కొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. మొదట కేవలం చర్చ మాత్రమే కోరారని మేం గుర్తు చేయగా, 'ఇప్పుడు నా డిమాండ్లు మారాయి' అని ఆయన సమాధానమిచ్చారు. ఆయన లాంటి సీనియర్ నేత ఇచ్చిన మాట నుంచి అంత త్వరగా వెనక్కి తగ్గడం ఏమిటంటూ వివరించేందుకు ప్రయత్నించగా, అది నా ఇష్టమంటూ రాహుల్ బదులిచ్చారు. రాహుల్ గాంధీ ప్రవర్తన ప్రజాస్వామ్య సూత్రాలకు ఏమాత్రం తగినట్లుగా లేదు' అని జితేంద్రసింగ్ విమర్శించారు.

**రాహుల్ ధర్నాపై రాజకీయ దుమారం!**

రాహుల్ గాంధీని ఈడ్చుకెళ్లిన పోలీసులు ధర్నాను విరమించటానికి కాంగ్రెస్ నేతలు అంగీకరించకపోవటంతో పోలీసులు వారిని బలవంతంగా తీసుకెళ్లటానికి ప్రయత్నించారు. రాహుల్‌గాంధీ ప్రతిఘటిస్తున్నప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా నేల మీద నుంచే ఈడ్చుకెళ్లారు.
ఫలితంగా, రాహుల్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఆయన ముక్కు నుంచి రక్తం కారినట్లుగా కనిపించింది. ఈ సమయంలో రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ 'భారతదేశంలో ప్రజాస్వామ్యం పరిస్థితికి ఇది ప్రత్యక్ష నిదర్శనం' అంటూ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ప్రియాంక గాంధీని సైతం పోలీసులు బలవంతంగా అరెస్టు చేసి వాహనంలోకి తీసుకెళ్లారు. పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్‌సింగ్‌చన్ని, కే సురేశ్, సుఖీందర్ రణ్‌ద్వా, పవన్‌ఖేరా తదితరులను కూడా పోలీసులు బలవంతంగా తరలించారు. అరెస్టు చేసిన నేతలను ఢిల్లీ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.
రాహుల్‌ను ఛత్రసాల్ స్టేడియంలో, ప్రియాంక గాంధీజీని మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ప్రియాంక సహా ఇతర ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. రాత్రి పొద్దుపోయిన తర్వాత రాహుల్, ప్రియాంక తదితర కాంగ్రెస్ నేతలను పోలీసులు విడుదల చేశారు.

# నీట్ నిందితులను రక్షిస్తున్న కేంద్రం

మొదటి పేజీ తరువాయి...

కనీసం వారి కుటుంబ సభ్యులకు సైతం చూపకుండా ఇతర ప్రాంతానికి తరలించడం ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్ దీక్షకు మద్ద తుగా వేలాది మంది నీట్ విద్యార్థులు మంగళవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌కు తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. ఆందోళనను ఉద్దేశించి ఆకునూరి మురళి మాట్లాడుతూ.. సోనమ్‌వాంగ్ చుక్ చేస్తున్న శాంతియుత దీక్షకు ప్రజా మద్దతు ఉందని, ఆయనను సందర్శించి పరామర్శించేదుకు వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రావటం ప్రజాభిమానానికి అద్దం పడుతుందన్నారు. నీట్ పరీక్షలో జరిగిన అవకత వకలను సరిదిద్దాల్సిన ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేయటంతో పాటు శాంతియుత దీక్షలను ఉక్కుపాదంతో అణిచివేసి రాక్షసానందం పొందేందుకు ప్రయత్నించడం ప్రభుత్వ అవివేకానికి నిదర్శనమన్నారు.

**ప్లకార్డులతో విద్యార్థుల నిరసనలు**

నీట్ పరీక్షపై ప్రభుత్వ నిర్లక్షాన్ని ఎండగడుతూ, సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నంపై నీట్ విద్యార్థులు కదం తొక్కారు. మంగళవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు వందల సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు బారులు తీరారు. ప్లకార్డులను చేతబట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

**అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన**

ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం నీట్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో శాంతియుతంగా నిరసన చేపట్టారు. ట్యాంక్‌బండ్ ఇరు మార్గాల నుంచి వందల సంఖ్యలో విద్యార్థులు ప్లకార్డులు చేతబట్టుకుని నినాదాలు చేస్తూ అంబేద్కర్ విగ్రహం వైపు రావటంతో వారిని వారించేందుకు పోలీసుల తరం కాలేదు. ఒక్కసారిగా వందల సంఖ్యలో విద్యార్థులు రావటంతో ట్యాంక్‌బండ్ ప్రాంతం విద్యార్థులతో నిండిపోయింది.

# కాళేశ్వరం మరమ్మతులు ఎందుకు చేయడం లేదు?

మొదటి పేజీ తరువాయి...

రైతుల పంటలను కొనుగోలు చేయరు, గిట్టుబాటు ధర ఇవ్వరు, యూరియా కోసం అనేక కష్టాలను రైతులు పడటమే కాంగ్రెస్ ప్రభుత్వం పని తీరు అని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో రకాల అబద్దపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి నేడు అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తుందన్నారు. వర్షానికి గోడ కూలీ రైతులు మరణిస్తే నేటికీ ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఎలాంటి సహాయం అందించలేదని విమర్శించారు. 'కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు, కరెంటు కోతలు, సాగునీటి అవస్థలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ పాలనలో నిరంతరాయంగా విద్యుత్, సమయానికి రైతుబంధు అందేవి. వ్యవసాయంలో పంజాబ్ను తలదన్నే రీతిలో తీర్చిదిద్దారు. కాళేశ్వరంతో కేసీఆర్‌కు పేరొస్తుందనే ఆ ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు ఒకరోజు నీరు లేవంటారు.. రెండో రోజు మరో కథ చెపుతారు. ఇది కాలం తెచ్చిన కరవు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువు' అని విమర్శించారు.

**మంచిర్యాల ఎమ్మెల్యే వేధింపులను సహించం**

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వేధింపులను సహించేది లేదని, ఎమ్మెల్యే తన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజా సంక్షేమం గురించి మీ ముఖ్యమంత్రిని అడిగి అభివృద్ధి పనులు చేయండి, అనవసరంగా మా పార్టీ నాయకుల, కార్యకర్తల జోలికి రావద్దన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్‌రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, సుంకె రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదా సు లక్ష్మణ్‌రావు, రాష్ట్ర నాయకులు విజిత్‌రావు, మాజీ డీసీఎమ్మెస్ తిప్పని లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, మాజీ యూత్ అధ్యక్షులు మారిశెట్టి సుమన్ పాల్గొన్నారు.

# పేపర్ లీక్ బాధ్యులను అత్యంత కఠినంగా శిక్షిస్తాం

మొదటి పేజీ తరువాయి...

భవిష్యత్తుకు నష్టం కలగకూడదనే ఉద్దేశంతో వెంటనే నీట్ రీఎగ్జామినేషన్ నిర్వహించాం. ఎలాంటి జాప్యం లేకుండా ఫలితాలు కూడా ప్రకటించాం. భవిష్యత్తులో ప్రశ్నపత్రాల లీకేజీలు జరగకుండా కఠిన చర్యలు తీసుకున్నాం. దేశంలోని అత్యుత్తమ న్యాయవాదుల సహకారంతో దోషులకు అత్యంత కఠిన శిక్షలు పడేలా చేయాలి. అప్పుడే ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు పునరావృతం కావు. ప్రశ్నపత్రాల లీకేజీ అనేది ఏ ఒక్క రాష్ట్రానికో, కేంద్ర ప్రభుత్వానికో పరిమితమైన సమస్య కాదు. దేశానికి సంబంధించిన సమస్య. ప్రశ్నపత్రాలు లీక్ చెయ్యడమనేది మహా పాపం, ఘోరం. లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పార్టీలకతీతంగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పని చేయాలి. లీకేజీలను నివారించేందుకు ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ అంశంలో నిరసనల్లో పాల్గొంటున్న పిల్లలను రెచ్చగొట్టవద్దు. యువతను సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది" అని ఎంపీలతో ప్రధాని అన్నారని రిజిజు వెల్లడించారు. కాగా, ఎన్డీయే ప్రభుత్వం వివిధ దేశాలతో చేసుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల(ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్) అంశంలో రైతులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని ప్రధాని పేర్కొన్నారని రిజిజు వెల్లడించారు.

# హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ పనులపై సీఎం సీరియస్

మొదటి పేజీ తరువాయి...

భవనాల నాణ్యత, మౌలిక వసతులు, రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్, డ్రైనేజీ వంటి అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భవిష్యత్తులో ఇది దేశంలోనే అత్యుత్తమ విద్యా కేంద్రంగా రూపుదిద్దుకోవాలని ఆకాంక్షించారు. నిర్మాణ పనులు అనుకున్న వేగంతో సాగకపోవడంపై ముఖ్య మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో జాప్యానికి కారణాలేమిటో అధికారులను నిలదీశారు. ప్రతి ప్రాజెక్టుకు స్పష్టమైన కాలపట్టిక రూపొందించి, నెలవారీగా ఎంత పని పూర్తయిందో తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇకపై ఆలస్యం సహించేది లేదని, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడవద్దని స్పష్టం చేశారు. ప్రజాధనం, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు.
ఎడ్యుకేషన్ హబ్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్ల కేటాయింపులో జరుగుతున్న జాప్యంపైనా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు వచ్చే వారంలోగా ప్లాట్ల పట్టాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదని, వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని స్పష్టం చేశారు. పర్యటన అనంతరం ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి, ఎడ్యుకేషన్ హబ్ నిర్మాణానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సమగ్రంగా సమీక్షించారు. పనుల్లో వేగం, నాణ్యత, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, హకీంపేట ఎడ్యుకేషన్ హబ్ తెలంగాణ విద్యా రంగానికి ఆదర్శంగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచే యాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర విద్యా రంగంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# కరోనా తరహాలో సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొందాం



మొదటి పేజీ తరువాయి...

ప్రజలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి 15 రోజులకు భూగర్భ జలాల పరిస్థితిపై సమీక్ష నిర్వహించి, వాస్తవ పరిస్థితిని రైతులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, ఇతర ఏర్పాట్లకు సంబంధించిన ఆర్థిక సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వం వెంటనే పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని తెలిపారు. ఈ సీజన్‌లో కాలువల ద్వారా సాగునీరు అందించే పరిస్థితి లేదని, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. రైతులు తక్కువ నీటి అవసరమున్న పంటలనే ఎంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కుమార్ మాట్లాడుతూ మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలో నీటి ఎద్దడి అధికంగా ఉందని, నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని కోరారు. "సేవ్ వాటర్" నినాదంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజగౌడ్, ఆర్డీవో నరసింహారావు, ఇరిగేషన్, మిషన్ భగీరథ, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోస్తలేరు

## దేవాదులపై సీఎంకు, మంత్రులకు అవగాహన లేదు

**సాగునీటి కోసం వరంగల్ రైతుల ఆందోళనలు**

**ట్యాంకర్లు, బిందెలతో పంటలకు నీళ్లు**

**ప్రభుత్వం కళ్లు తెరవకుంటే ప్రజా ఉద్యమం**

**మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక**




హైదరాబాద్, జూలై 21 : 'ఇది ఎల్ నినో తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు. సాగునీటి కోసం వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతులు ధర్నాలు చేస్తున్నారు. ట్యాంకర్లు, బిందెలతో నీళ్లు పడుతూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినా రైతుల గోస ప్రభుత్వానికి పట్టడం లేదు. గోదావరిలో నీళ్లున్నా ఎత్తిపోస్త లేరు?' అని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దేవాదుల పంపులు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నిలదీస్తే అప్పుడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లి హడావుడి చేశారని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు కింద ఎన్ని రిజర్వాయర్లు ఉన్నాయో కూడా నీళ్ల మంత్రికి తెలియదని ఎద్దేవా చేశారు. దేవాదుల 10 మోటార్లు నడిపి 22 రిజర్వాయర్లు నింపాలని, 3 లక్షల 17 వేల ఎకరాలకు సాగునీటితో పాటు ప్రజలకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం స్పందించకపోతే వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల రైతులతో కలిసి ప్రజాపోరుకు సిద్ధమవుతామని హెచ్చరించారు. 22 రిజర్వాయర్లు నింపుతామని, 38 టీఎంసీల నీళ్లు ఎత్తిపోస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి రైతులు వరి నార్లు పోశారని, ఇప్పుడు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు.
కేసీఆర్ నిర్మించిన సమ్మక్క బరాజ్‌లో 3 టీఎంసీల నీరు నిల్వ ఉందని, బరాజ్‌లోకి 22 వేల క్యూసెక్కుల వరద ఉందని, అయినా ఆయకట్టు సరిపడా నీరివ్వడం లేదన్నారు. దేవాదుల 10 పంపులు నడుస్తాయని మంత్రులు చెప్పారని, నిన్నటి వరకు ఐదు పంపులే నడిచాయన్నారు. మంత్రులు వెళ్లినప్పుడే ఏడు మోటార్లు నడుస్తున్నాయని, వాస్తవానికి మూడు మోటార్లు నడుపుతున్నారని ఆరోపించారు.

**నీళ్ల ఎత్తిపోతలోనూ వాయిదాలే..**

ఇది తుగ్లక్ ప్రభుత్వమని, రాష్ట్రాన్ని నడిపే పద్ధతి ఇదేనా? అని విమర్శించారు. రైతు బోరు ఎండితే నీళ్ల కోసం రకరకాల మార్గాలు వెతుకుతాడని, కానీ ప్రభుత్వం ఎందుకు తపన పడటం లేదో చెప్పాలన్నారు. రైతులు ట్యాంకర్లు, బిందెలతో పంటలకు నీళ్లు పెడుతున్నా రేవంత్‌రెడ్డికి సోయి లేదన్నారు. గ్యారెంటీల అమలులో వాయిదాల లెక్కనే.. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలే అని ఎద్దేవా చేశారు.
కాళేశ్వరం అంటే తమ మీద పడి ఏడ్చారు.. మరి దేవాదుల వద్ద ఏం అడ్డం వచ్చింది?, ఇప్పటి వరకు ఎందుకు నీళ్లు లిఫ్ట్ చేయలేదన్నారు. ఎల్ నినో పేరుతో నీళ్లకు ఎగనామం పెడితే ఊరుకోమని హెచ్చరించారు. దేవాదుల, సమ్మక్క బరాజ్‌ల నుంచి 105 టీఎంసీల నీళ్లు ఏపీ వైపు వెళ్లిపోయాయని, మీరు ఎత్తింది కేవలం 1.9 టీఎంసీలు మాత్రమేనన్నారు.
దేవాదుల ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలని, నీటిని ఎత్తిపోస్తే 50 రోజుల్లో అన్నీ నిండేవన్నారు. దేవాదుల వద్ద 78 మీటర్ల లెవల్‌లో గోదావరి ప్రవహిస్తోందన్నారు. నీటిని ఎత్తిపోయడంలో విఫలమైన మంత్రులు.. రైతులకు క్షమాపణలు చెప్పాలని దమాండ్ చేశారు.

**నీళ్లడిగితే మాపై యుద్ధమా?**

'జనగామ, హన్మకొండ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతుంది. దేవాదుల పూర్తి చేస్తామని డైలీ సీరియల్‌లాగ ఎన్నిసార్లు చెబుతారు' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆయకట్టు అంతటికీ దేవాదుల నీళ్లు పారాయన్నారు. కేసీఆర్ నీళ్ల కోసం యుద్ధం చేస్తే.. మీరు మాపై యుద్ధం చేస్తున్నారని విమర్శించారు. తాము కాళేశ్వరం గురించి మాట్లాడితే తమ్మిడిహట్టి ప్రాజెక్టు కడతామంటున్నారని, 30 నెలలుగా తట్టెడు మట్టి కూడా తీయలేదన్నారు. 12 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామని చెప్పి ఇచ్చారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి దేవాదుల ఎక్కడుందో తెలియదు, బేసిన్లు అంటే ఏమిటో తెలియదన్నారు. చిల్లర రాజకీయాలు మానుకొని తాగు, సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, రాజయ్య, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆరూరి రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విడిచిపెట్టడమా.. ఒడిసిపట్టడమా?**

చంద్రబాబుకు నీళ్ళ విడిచిపెట్టడమా? తెలంగాణ రైతులకు నీళ్లు ఒడిసిపట్టడమా? మీ ఆలోచన ఏమిటి? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం వల్ల వరంగల్ జిల్లాను కరువు కోరల్లోకి నెట్టారని పేర్కొన్నారు. 3.17 లక్షల ఎకరాల ఆయకట్టు కు నీళ్లివ్వడానికి తాము దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. గత ఏడాది 50 రోజులు ఆలస్యంగా మోటార్లు ఆన్ చేయడం వల్ల రూ.700– కోట్ల విలువైన పంటలు ఎండిపోయాయని పేర్కొన్నారు. గోదావరిలో నీరున్నా ఒడిసిపట్టకుండా విడిచిపెడుతున్నారని పేర్కొన్నారు.
కాళేశ్వరం పంపులు ఆన్ చేయకుండా డ్రామాలు చేశారని ఆరోపించా రు. వరంగల్ కలెక్టర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నీళ్లు ఇవ్వం, నాట్లు వేయొద్దని చెబుతుంటే.. మంత్రులు మాత్రం 3 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తామనడం విడ్డూరంగా ఉం దన్నారు. పొంతన లేటి మాటలతో రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేశార ని, నాట్లు వేసిన రైతుల పరిస్థితి ఏమిటన్నారు. గోదావరిలో నీళ్లున్నాయని, అయినా కలెక్టర్ ఎందుకు తూములు మూశారు? అని ప్రశ్నించారు.

## ఆరుతడి పంటలపై అవగాహన సదస్సు



రుద్రంగి, జూలై 21, (ప్రజాకలం ప్రతినిధి)
రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు (ఎల్‌నినో) మరియు నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని, వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చెర్మెన్ చెలుకల తిరుపతి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులకు ఏఎంసి చెర్మెన్ చెలుకల తిరుపతి ఆరుతడి పంటలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు వర్షాభావ పరిస్థితుల దృశ్య ప్రభుత్వ నిర్దేశాల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలకు వెళ్లాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ నాయకులు ఎర్రం గంగనర్సయ్య, కట్కూరి దాసు, ద్యావాల రవి, రైతులు పాల్గొన్నారు.

# నంది మేడారం రచ్చపల్లి లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన మంత్రి

- అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్ కు రైతులు కనిపించలేదు
- కొండగట్టు బాధితులను ఎందుకు పరామర్శించలేదు
- సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ధర్మారం, జూలై 21 :
( ప్రజా కలం ప్రతినిధి )
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నంది మేడారం గ్రామం లో మంగళవారం రోజున మంత్రి అడ్లూరి పర్యటించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అధికారం లో ఉన్న సమయం లో కేటీఆర్ కు రైతులు గాని రైతుల సమస్యలు గుర్తుకు రాలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా నంది మేడారం, రచ్చపల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నర్ కార్యక్రమం లో పాల్గొన్నారు. రాష్ట్రం లో బీఆర్ఎస్ పార్టీ అధికారం లో ఉన్న సమయం లో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని మంత్రి ఆరోపించారు. అధికారం దూరమైన తర్వాత కేటీఆర్ రైతుల పరామర్శ పేరట డ్రామాలు వాడుతున్నారని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరో పించారు. కొండగట్టు బస్సు ప్రమాదం లో మరణించిన బాధిత కుటుంబాలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందుకు పరామర్శించ లేదని మంత్రి లక్ష్మణ్ కుమార్ ప్రశ్నించారు. ఒక వైపు ఎల్ నినో ప్రభావం తో వర్షాలు లేక రాష్ట్ర రైతులు ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో రైతులకు అండగా ఉండి వారికి మనోధైర్యం కల్పించాల్సిన బాధ్యత మరిచి ప్రతిపక్ష నాయకులు వ్యవహరిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. నంది మేడారం రిజర్వాయర్ నిర్మాణ సమయం లో నంది మేడారం గ్రామస్తులకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మిస్తామని నాటి మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట ఇచ్చి తప్పారని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని మంత్రి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

## ధర్మారం మండల కేంద్రంలో కేటీఆర్,కొప్పుల కు ఘన స్వాగతం



ధర్మారం, జూలై 21 : ( ప్రజా కలం ప్రతినిధి ) మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట లో నిర్వహించ తలపెట్టిన భారీ రైతు సదస్సుకు వెళ్తున్న కెటిఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధర్మారం మండల కేంద్రం లో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక నాయకులు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ?ఈ సందర్భంగా ధర్మారం మండల కేంద్రం లో వందలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రోడ్డుకు ఇరువైపులా చేరి, పూల వర్షం కురిపిస్తూ, జై కేసీఆర్ జై బీఆర్ఎస్ శ్రేణులు నినా దాల తో హోరెత్తించారు. ఈ కార్యక్రమం లో మండల ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్..

### 24 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం
### వృద్ధులను లక్ష్యంగా చేసుకుని మోసాలు - ముగ్గురు నిందితుల అరెస్ట్
### వివరాలు వెల్లడించిన కోరుట్ల సీఐ లక్ష్మీనారాయణ

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 21 (ప్రజా కలం) అమాయక ప్రజలను, ముఖ్యంగా వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దృష్టి మళ్లించి బంగారు ఆభరణాలు అపహరిస్తున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను కోరుట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం సీఐ కార్యాలయంలో ఎస్సై చిరంజీవితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితులు అల్లెపు కృష్ణ, కుంచెపు శ్రీకాంత్, అల్లెపు రాజ్‌కుమార్ సిద్దిపేట జిల్లాకు చెందినవారని, తమ ప్రాంతంలో గుర్తుపడే అవకాశం ఉండటంతో ఇతర జిల్లాల్లో దొంగతనాలకు పాల్పడాలనే ఉద్దేశంతో జూలై 15న కోరుట్లకు వచ్చి ఓ లాడ్జిలో బస చేశారన్నారు. జూలై 16న కోరుట్ల బస్టాండ్ పరిసరాల్లో సంచరిస్తూ సుమారు 70 ఏళ్ల వృద్ధురాలిని లక్ష్యంగా చేసుకుని, ఆమెకు నెలవారీ పెన్షన్‌ను రూ. 2 వేల నుంచి రూ. 4 వేల వరకు పెంచిస్తామని నమ్మించి, అనంతరం ఎస్‌బీఐ బ్యాంకు సమీపానికి తీసుకెళ్లారన్నారు. బంగారు ఆభరణాలు ధరించి ఉంటే పెన్షన్ మంజూరు కాదని నమ్మబలికి, ఆమె మెడలోని 24 గ్రాముల బరువున్న లక్ష్మీదేవి బిళ్లల బంగారు గొలుసును అపహరించారని పేర్కొన్నారు.



మరిన్ని దొంగతనాలకు పాల్పడేందుకు కోరుట్లలోనే లాడ్జిలో ఉన్న సమయంలో అందిన సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. వారి వద్ద నుంచి 24 గ్రాముల బంగారు గొలుసుతో పాటు రియల్‌మీ, శాంసంగ్ కంపెనీలకు చెందిన రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించామని, విచారణలో ప్రధాన నిందితుడు అల్లెపు కృష్ణపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో 100కు పైగా కేసులు నమోదైనట్లు, మిగతా ఇద్దరు నిందితులపై కూడా అనేక దొంగతనాల కేసులు ఉన్నట్లు వెల్లడైందని పోలీసులు తెలిపారు. నిందితులను న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ లక్ష్మీనారాయణ వెల్లడించారు.

## ప్రభుత్వ విప్ విజయరమణ రావుకు రాష్ట్ర మంత్రి హోదా

పెద్దపల్లి,జూలై21:(ప్రజాకలం జిల్లాప్రతినిధి) ప్రభుత్వ విప్‌లుగా సేవలందిస్తున్న పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావుకు రాష్ట్ర మంత్రి హోదాను కల్పిస్తూ మంగళవారం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం, నియోజకవర్గాల అభివృద్ధి మరియు శాసనసభలో ప్రభుత్వ తరఫున సమర్థవంతంగా సేవలు అందిస్తున్న



చింతకుంట విజయరమణ రావుకి ఈ హోదా దక్కడం ఆయన సేవలకు ప్రభుత్వం నుంచి లభించిన సముచిత గుర్తింపుగా భావిస్తున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాష్ట్ర మంత్రి హోదాకు తగిన అన్ని అధికారిక ప్రోటోకాల్‌లు మరియు మర్యాదలు ఆయనకు పూర్తిగా వర్తిస్తాయి. విజయరమణ రావుకి రాష్ట్ర మంత్రి హోదా లభించడం పట్ల పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## వివాహిత మహిళ మరణానికి కారణమైన వ్యక్తి అరెస్ట్, రిమాండ్ కి తరలింపు



రుద్రంగి, జూలై 21, (ప్రజాకలం ప్రతినిధి) రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన బాధవేణి కావ్య కనిపించడం లేదంటూ గత 19 - 02- 2026 న ఫిర్యాదు అందగా.. రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఉమెన్ మిస్సింగ్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరిగిందని, విచారణలో భాగంగా తేదీ 02.03.2026 రోజున పెద్దపల్లి జిల్లా జూలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వాటర్ కెనాల్‌లో లభించిన గుర్తుతెలియని మృతదేహాన్ని, జూలపల్లి పోలీసుల సహాయంతో మిస్సైన బాధితురాలు బాధవేణి కావ్య దిగా గుర్తించడమైనదని,బంధువుల వాంగ్మూలాలు, కాల్ డేటా ఆధారంగా విచారించగా.. అదే గ్రామానికి చెందిన సూర యాదయ్య తనను శారీరకంగా లొంగదీసుకోవాలని ఫోన్లో తీవ్రంగా వేధించినట్లు నిర్ధారణ అయిందని, బాధితురాలు మరియు ఆమె కుటుంబ సభ్యులు ఎంత వారించినా అతను వేధింపులు ఆపకపోవడంతో ఆ మానసిక క్షోభ భరించలేక ఆమె ఆత్మహత్య చేసుకుందని, నేరం రుజువు కావడంతో నిందితుడు సూర యాదయ్యను మంగళవారం చందుర్తి సీఐ కె. రవీందర్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## టీఆర్ఎస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జూలై 21(ప్రజా కలం): కోరుట్ల నియోజకవర్గంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లోకి చేరికలు కొనసాగుతున్నాయి. కోరుట్ల మండలం యూసఫ్‌నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షురాలు గొల్లపల్లి విజయ తన పదవికి రాజీనామా చేసి, తెలంగాణ రక్షణ సేన నేత డాక్టర్ రఘు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా గొల్లపల్లి విజయతో పాటు సుమారు 40 మంది కార్యకర్తలు కూడా టీఆర్ఎస్‌లో చేరగా, వారికి డాక్టర్ రఘు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేనకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని కొత్తగా చేరిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో టీఆర్ఎస్ బలోపేతానికి ఈ చేరికలు దోహదపడతాయని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

## జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు

- రోడ్డు భద్రతపై జిల్లా అధికారులకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ఆదేశాలు



జగిత్యాల ప్రతినిధి జూలై 21 (ప్రజాకలం)
జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన రోడ్డు భద్రత చర్యలు అమలు చేయాలని రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జాతీయ రహదారులపై రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పాల్గొన్నారు. వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సంబంధించి సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాలు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. ఇప్పటివరకు బీహార్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలు మాత్రమే అనుసరణ నివేదికలు సమర్పించాయని, మిగిలిన రాష్ట్రాలు కూడా త్వరితగతిన నివేదికలు పంపాలని అన్నారు. జాతీయ రహదారులపై అనధికారిక పార్కింగ్‌ను పూర్తిగా నివారించాలని, భారీ వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని, పెట్రోలింగ్‌ను బలోపేతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారుల అధికారులు, పోలీసు శాఖ, ఇతర సంబంధిత శాఖలు కలిసి సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. అలాగే, రహదారులపై ఆక్రమణలను వెంటనే తొలగించాలని, ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రులను మ్యాపింగ్ చేసి అత్యవసర వైద్య సేవలు వేగంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పక్కన కొత్త మద్యం దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయరాదని స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న రహదారుల్లో ప్రమాదాలను తగ్గించే మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి జిల్లా రోడ్డు భద్రతకు సంబంధించి చేపట్టిన చర్యలపై సమగ్ర కార్యాచరణ నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రోడ్డు భద్రత అంశాన్ని సుప్రీంకోర్టు అత్యంత నిశితంగా పర్యవేక్షిస్తోందని, అన్ని శాఖల సమన్వయంతో చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రవాణా శాఖ అధికారి సంధానితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్

మల్లాపూర్, జూలై 21 (ప్రజా కలం):
ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలం సాతారం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు.
పాఠశాలకు మొత్తం 39 తరగతి గదులు అవసరం ఉండగా ప్రస్తుతం 16 గదులు మాత్రమే ఉన్నాయని, మరో 23 అదనపు తరగతి గదుల నిర్మాణానికి సుమారు రూ. 12 కోట్ల వ్యయం అవసరమని అధికారులు వివరించారు. అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రతిపాదిత తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, ఫర్నిచర్, విద్యుత్ తదితర మౌలిక వసతులను పరిశీలించి, అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను పాఠశాల ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో ఆర్డీవో నరసింహారావు, మండల విద్యాధికారి దామోదర్ రెడ్డి, తహసీల్దార్ రామచందర్, సర్పంచ్ నారాయణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

-జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

ప్రజా కలం జూలై 21 (గద్వాల ప్రతినిధి) రహదారి ప్రమాదాల తో ఏటా ఎంతో మంది మృత్యువాత పడుతూ, క్షతగాత్రులుగా మారుతున్నారని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రహదారి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలపై మంగళవారం హైదరాబాద్ నుంచి బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రహదారుల భద్రతకు తమ వంతుగా కృషి చేస్తుందని, ఆయా జిల్లాల పరిధిలోని సంబంధిత శాఖల అధికారులు వారికి సహకరించాలన్నారు. రవాణా, పోలీస్, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులతో కలిసి జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలను ఎన్నుకోవాలన్నారు. జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీలు, హైవే సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కమిటీలతో కలిసి పని చేసేందుకు తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీసీ అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, రోడ్ సేఫ్టీ కమిటీలు ఇప్పటివరకు రహదారి భద్రతపై నిర్వహించిన కార్యక్రమాల వివరాలను అడిగారు. హైవేలపై పెట్రోలింగ్ వాహనాల సేవలు, బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై మాట్లాడారు. హైవే స్థలాలను ఆక్రమించి ఏర్పాటు చేసిన డాబాలు, ఇతర నిర్మాణాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. హైవేల భద్రతకు సంబంధించి ఇదివరకు నిర్వహించిన కార్యక్రమాలు, సమావేశాలు, భవిష్యత్తులో చేయబోయే కార్యాచరణ ప్రణాళికపై ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలను సమర్పించాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో కలెక్టరేట్ ఇన్చార్జి ఏవో మంజుల, నేషనల్ హైవే రేసిడెంట్ ఇంజనీర్ బాలచందర్, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది

కర్రే సునీత కుటుంబాన్ని పరామర్శించిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 21(ప్రజా కలం) మెట్‌పల్లి మండలం చింతలపేట గ్రామంలో ఇటీవల దారుణ హత్యకు గురైన కర్రే సునీత కుటుంబాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన మంత్రి, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందజేస్తామని మంత్రి తెలిపారు. కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు, మృతురాలి కుమారులు చదువు పూర్తయ్యే వరకు వారి విద్యా బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. భవిష్యత్తులో వారికి ఉద్యోగ అవకాశాల కల్పనలో కూడా ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరుపున రూ. 4,12,500 విలువైన ఆర్థిక సహాయ చెక్కును మంత్రి అందజేశారు. కర్రే సునీత హత్య కేసులో నిందితులు ఎవరైనా, ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని శిక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అన్ని చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) అశోక్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రాజ్ కుమార్, మెట్‌పల్లి డివిజన్ రెవెన్యూ అధికారి నరసింహ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుల సంఘ నాయకులు, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.

ప్రజా కలం
బుధవారం, జూలై 22, 2026

## భార్యల చేతిలో భర్తల 'బలి'

దేశంలో భర్తల భద్రతపై ఆందోళన పెంచుతున్న 'ఏకం న్యాయ్ ఫౌండేషన్' నివేదిక సంచలనం రేపుతోంది. 2026 జనవరి నుండి జులై 14 వరకు ఆరు నెలల కాలంలో ఏకంగా 554 మంది భర్తలు హత్యలు లేదా ఆత్మహత్యల కారణంగా ప్రాణాలు కోల్పోయినట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఇందులో 322 మంది భార్యలు లేదా వారి ప్రియుల చేతిలో దారుణంగా హత్యకు గురయ్యారు. మిగిలిన 232 మంది వైవాహిక విభేదాలు, గృహహింస, మానసిక వేధింపుల కారణంగా ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతిరోజూ సగటున ఇద్దరు భర్తలు హత్యకు గురవుతుండగా, ఒకరి కంటే ఎక్కువ మంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ మరణాల వెనుక వివాహేతర సంబంధాలు, కుటుంబ కలహాలు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. కుటుంబ వ్యవస్థలో పెరుగుతున్న అశాంతి పురుషుల జీవితాలను తీవ్ర ప్రమాదంలోకి నెట్టేస్తోంది. ఈ గణాంకాలు సమాజంలో నెలకొన్న విషాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. భర్తలపై జరుగుతున్న హత్యలు, ఆత్మహత్యలపై గురుగ్రామ్‌కు చెందిన ఏకం న్యాయ్ ఫౌండేషన్ విడుదల చేసిన తాజా నివేదిక తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 2026 తొలి ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా 554 మంది భర్తలు హత్యలు, ఆత్మహత్యలు చోటు చేసుకున్నట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ వెల్లడించింది. అయితే ఇవి ప్రభుత్వ అధికారిక గణాంకాలు కాదని.. మీడియా కథనాలు, ఫౌండేషన్ సేకరించిన వివరాల ఆధారంగా రూపొందించిన డాక్యుమెంటేషన్ రిపోర్టు మాత్రమేనని స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం.. మొత్తం 322 మంది భర్తలు హత్యకు గురయ్యారని తెలుస్తోంది. వీరిలో అత్యధిక కేసులు భార్యలు లేదా వారి వివాహేతర సంబంధాల నేపథ్యంలో జరిగిన కుట్రలతో ముడిపడి ఉన్నట్లు ఆ సంస్థ పేర్కొంది. మొత్తం హత్యల్లో 194 కేసులు (సుమారు 60.2 శాతం) వివాహేతర సంబంధాల కారణంగానే జరిగినట్లు ఆ రిపోర్టు వెల్లడించింది. భార్యలు, తమ ప్రియులతో కలిసి కట్టుకున్న భర్తలను హత్య చేసిన ఘటనలు ఎక్కువగా నమోదు అయ్యాయని ఆ నివేదిక తెలిపింది. అదే సమయంలో 232 మంది భర్తలు ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ పేర్కొంది. వీటిలో కుటుంబ కలహాలు, గృహహింస, మానసిక వేధింపులు, తప్పుడు క్రిమినల్ కేసులు, పిల్లలను కలవనివ్వకపోవడం వంటి కారణాలు ప్రధానంగా ఉన్నాయని నివేదికలో వివరించింది. ఈ కేసుల్లో విషం పెట్టి చంపడం, గొంతు నులిమి హత్య చేయడం, విద్యుత్ షాక్ పెట్టి హతమార్చడం, సజీవదహనం చేయడం, మృతదేహాలను ముక్కలు ముక్కలుగా నరకడం, చంపేసి ప్రమాదంగా లేదా ఆత్మహత్యగా చిత్రీకరించడం వంటి అత్యంత దారుణమైన నేరాలు నమోదు అయినట్లు ఆ నివేదిక తెలిపింది. రాష్ట్రాల వారీగా చూస్తే అత్యధికంగా 93 హత్యలు, 103 ఆత్మహత్యలతో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచినట్లు ఏకం న్యాయ్ ఫౌండేషన్ రిపోర్టు తెలిపింది. ఆ తర్వాత మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మహారాష్ట్ర, హర్యానా, బీహార్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కూడా ఇలాంటి కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని పేర్కొంది. అయితే.. ఈ నివేదికపై ప్రభుత్వ అధికారిక ధృవీకరణ లేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. దేశంలో భర్తల హత్యలు లేదా పురుషులపై గృహహింసకు సంబంధించిన ప్రత్యేక జాతీయ డేటాబేస్ లేకపోవడంతో అసలు సంఖ్య మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏకం న్యాయ్ ఫౌండేషన్ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో జరిగిన ఘటన అందరినీ గ్భ్రాంతికి గురిచేసింది. అతుల్ పవార్ అనే వ్యక్తిని తన భార్య దామిని, ప్రియుడు తుషార్‌తో కలిసి విషసర్పంతో కాటేయించి చంపేసింది. భర్త పేరుపై ఉన్న 20 లక్షల రూపాయల బీమా సొమ్మును కాజేయాలని, ప్రియుడితో కలిసి జీవించాలని ఆమె పన్నిన పన్నాగం ఇది. నిందితులు పామును కొనుగోలు చేసి, నిద్రమాత్రలు కలిపిన పాలు తాగించి ఈ దారుణానికి ఒడిగట్టారు. పోలీసులు సాంకేతిక ఆధారాలు, కాల్ డేటాను విశ్లేషించి నిందితులను అరెస్టు చేశారు. 20 రోజుల క్రితమే కారుతో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించినట్లు విచారణలో తేలింది. ఈ కేసు భార్యాభర్తల మధ్య పెరిగిపోయిన ద్వేషాన్ని, డబ్బు కోసం ఎంతటి దారుణానికైనా తెగించే కఠిన మనస్తత్వాలను కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. ఇలాంటి ఘటనలు కుటుంబ సంబంధాల పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నాయి. వైవాహిక జీవితంలో నెలకొంటున్న ఇటువంటి తీవ్రమైన సమస్యలను పరిష్కరించేందుకు కౌన్సెలింగ్, చట్టపరమైన అవగాహన కార్యక్రమాలు అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం చట్టం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యతతో కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మానసిక ఒత్తిడి, అపార్థాలను తొలగించుకోవడానికి సంభాషణలు మాత్రమే సరైన మార్గం. పురుషులు కూడా తమ సమస్యలను పంచుకునే వేదికలు, మానసిక ఆరోగ్య సేవలు అందుబాటులోకి రావాలి. ఈ గణాంకాలు ప్రభుత్వాలు, సమాజం కలిసి పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని హెచ్చరిస్తున్నాయి. భర్తల ప్రాణాలను కాపాడడం, కుటుంబాలను విచ్ఛిన్నం కాకుండా చూడడం అందరి బాధ్యత. రాబోయే రోజుల్లో అయినా ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు తగ్గుతాయని, ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు నెలకొంటాయని ఆశిద్దాం. సామాజిక చైతన్యం ద్వారా మాత్రమే ఇటువంటి దారుణాలకు ముగింపు పలకడం సాధ్యమవుతుంది. ఈ సమస్య తీవ్రతను అంచనా వేయాలంటే అధికారిక గణాంకాల సేకరణ అవసరమని ఏకం న్యాయ్ ఫౌండేషన్ సంస్థ సూచించింది.

# జర్నలిస్టులు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం పొందాలి

- మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి
- మునీర్ జీవితం అందరికీ ఆచరణీయం
- రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్
- ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ పుస్తక ఆవిష్కరణ



పెద్దపల్లి,జూలై 21: (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

ప్రజల పక్షాన నిలిచి,నిష్పక్షపాతంగా పనిచేసినప్పుడే జర్నలిస్టులకు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రెస్ క్లబ్-గోదావరిఖని సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ప్రోలిటేరియన్ జర్నలిస్ట్ మునీర్ పుస్తక పరిచయ సభ అత్యంత ఘనంగా జరిగింది. అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు మాదాసి రామమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకకు కే.శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించగా,రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి మునీర్ స్మృతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో మీడియా రంగం పూర్తిగా కార్పొరేట్,పెట్టుబడిదారుల చేతుల్లోకి వెళ్ళిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన 12 ఏళ్లలో ప్రధాన మంత్రి కనీసం ఒక్క మీడియా సమావేశం కూడా ఏర్పాటు చేయకపోవడం ప్రజాస్వామ్యానికి తీవ్ర నష్టదాయకమని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ జర్నలిస్టులకు శాపంగా మారాయని, ఈ చట్టాల ద్వారా సమాజంలో నాలుగో స్తంభంగా నిలిచే జర్నలిస్టులను,దుకాణాల్లో పనిచేసే కూలీలను ఒకే గాటన కట్టడం అప్రజాస్వామికమని విమర్శించారు. జర్నలిస్టుల జీత భత్యాల పెంపు కోసం మరో సమరశీల పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రధాన పత్రికలు తమ వృత్తి నిబద్ధతను కోల్పోవడం వల్లనే నేడు సోషల్ మీడియా ఆదరణ విపరీతంగా పెరిగిపోయిందని తెలిపారు. సోషల్ మీడియాలో ఎలాంటి తనిఖీ,నియంత్రణ లేకపోవడం వల్ల వాస్తవానికి దూరమైన కథనాలు ప్రసారమవుతున్నాయని,వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**నిర్భయ జర్నలిజానికి ప్రతీక మునీర్ -రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్**

అక్షరాలను నమ్ముకుని జీవితాంతం ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మునీర్ జీవితం అందరికీ ఆచరణీయమని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్ కొనియాడారు. ముఖ్యమంత్రులతో సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ ఆయన ఎప్పుడూ సాదాసీదా జీవితమే గడిపారని గుర్తుచేశారు.

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని జర్నలిస్టులకు త్వరలోనే ఇంటి స్థలాలు,ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కోల్ బెల్ట్ జర్నలిస్టులకు ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచిన మునీర్ జీవితంపై సమగ్ర పరిశోధన జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పుస్తక పరిచయ సభలో పుస్తక సమీక్షను హెచ్.రవీందర్ నిర్వహించగా,రచయిత నక్క వెంకట్రావు తోపాటు రామగుండం కార్పొరేషన్ మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, టీయూడబ్ల్యూజే-ఐజేయు జాతీయ నాయకుడు నగునూరి శేఖర్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్,జిల్లా అధ్యక్షుడు మల్లావజుల వంశీ,గోదావరిఖని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు డి.మాధవరావు,గడ్డం శ్యామ్ కుమార్,ఇఫ్టా జాతీయ నాయకులు కే.స్వామి,వీరితో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు,తదితరులు పాల్గొని మునీర్ సేవలను స్మరించుకున్నారు.

## దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుంది



వెల్గటూర్, జులై 21 ప్రజాకలం ప్రతినిధి : దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపు దిద్దుకుంటుందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా, వెల్గటూర్ మండలంలోని కుమ్మరిపల్లె గ్రామంలో గల ఆదర్శ పాఠశాలను మంత్రి, నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నూతనంగా నిర్మించిన వంట గదిని ప్రారంభించారు. అనంతరం అక్కడున్న విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ పాఠశాలలో క్రీడా మైదానం లేదని, జూనియర్ కాలేజీలో గల విద్యార్థులు గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని అన్నారు. ఇక్కడ గల పాఠశాలలో వంట గది లేకపోవడంతో వంట నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకొని రూ. 10 లక్షల నిధులను మంజూరు చేయించి,దానిని నిర్మించి ఈరోజు ప్రారంభించినట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందు కోసం ఈరోజు చేతి పంపును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులకు క్రీడా మైదానం ఏర్పాటు కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, మెరుగైన మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా పని చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందనే దీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, వెల్గటూర్ మాజీ సర్పంచ్ మెరుగు మురళి గౌడ్, జిల్లా కార్యదర్శి గంద్ర శ్రీకాంత్ రావు, వెల్గటూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్ల తిరుపతి, ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు గంద్ర ప్రతాపరావు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, మేరుగు నరేష్ గౌడ్, గుండాటి సందీప్ రెడ్డి, నాయకులు ముచ్చర్ల తిరుపతి, నక్క సురేష్, ఎనగందుల సంతోష్, గుమ్ముల అజయ్, జూపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం నుంచి ఉమ్మడి జిల్లాకు చుక్క నీళ్లు ఇవ్వలేదు

- తుమ్మిడిహట్టి నుంచి గోదావరి జలాలు తెస్తాం - ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు

పెద్దపల్లి,జూలై 21:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నీళ్లను కేవలం మెదక్, గజ్వేల్,సిద్ధిపేట జిల్లాల కోసమే ఉపయోగించుకుందని,ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చుక్క నీళు కూడా ఇవ్వలేదని తెలంగాణ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో మల్యాల,తారుపల్లి, మీర్జంపేట,కాల్వ శ్రీరాంపూర్ గ్రామాల్లో నక్కల ఒర్రెపై బ్రిడ్జి, మీర్జాంపేట-తారుపల్లి మధ్య బ్రిడ్జి,వ్యవసాయ మార్కెట్ భవనం, మహిళా భవనం,పాఠశాలల ప్రహరీలు,సీసీ రోడ్లు తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. అనంతరం పెద్దరాతపల్లిలో హుజూరాబాద్-జమ్మికుంట నుంచి గోదావరిఖనికి వెళ్లే నూతన బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక రాగానే కాళేశ్వరంకు మరమ్మతులు చేపట్టి,తుమ్మిడిహట్టి ద్వారా నీటిని తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం శ్రీరాంపూర్ లోని 30 పడకల ఆసుపత్రిని కుదించిందని విమర్శిస్తూ,తమ ప్రభుత్వంలో దానిని వంద శాతం పునరుద్ధరిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో వర్షభావ పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉన్నందున రైతులు 4 ఎకరాలకు 2 ఎకరాల్లోనే వరి వేసి,మిగతా భూమిలో కంది,నువ్వులు,వేరుశనగ,పొద్దుతిరుగుడు వంటి ఆరుతడి పంటలు సాగు చేయాలని,రాష్ట్రంలో 24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని,డీఏపీకి బదులు సూపర్, నానో ఎరువులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్,మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతి రెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చదువు రామచంద్రం రెడ్డి,మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,తహసిల్దార్ రాపెల్లి రాముడు,ఏఓ సంధ్య,కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాజనేవెన సదయ్య,తులా మనోహర్ రావు,ఎండీ మునిర్, సర్పంచులు,మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ వసూళ్ల పై ఫిర్యాదు చేస్తే బెదిరింపులా..?

మల్లాపూర్, జూలై 21 (ప్రజా కలం ప్రతినిధి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో గ్యాస్ కనెక్షన్ పేరు మార్పు కోసం రూ. 1,000 అక్రమంగా డిమాండ్ చేశారని ఆరోపిస్తూ ఓ బాధితుడు మంగళవారం తహసీల్దార్ రామచందర్‌కు ఫిర్యాదు చేశారు. తండ్రి మృతి చెందిన నేపథ్యంలో గ్యాస్ కనెక్షన్‌ను తన పేరుపై మార్చించుకునేందుకు ఏజెన్సీని సంప్రదించగా, పేరు మార్పు చేయాలంటే రూ. 1,000 చెల్లించాలని సిబ్బంది కోరినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పత్రాల ఖర్చుల పేరుతో నగదు తీసుకుంటామని, అయితే ఎలాంటి రసీదు ఇవ్వబోమని చెప్పినట్లు బాధితుడు ఆరోపించారు. అక్రమ వసూళ్లపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం ఏజెన్సీ నుంచి తనకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడినట్లు బాధితుడు ఆరోపించాడు. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను బాధితుడు కోరారు.

## కోరుట్లలో ఆర్టీసీ బస్సు చోరీ

- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు
- నిజామాబాద్ వైపు బస్సుతో పరార్..
- గండి హనుమాన్ ఆలయం సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు






మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి జులై 21(ప్రజా కలం) కోరుట్ల ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును గుర్తుతెలియని వ్యక్తి చోరీ చేసిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. కోరుట్ల బస్టాండ్‌లో నిలిపి ఉంచిన ఆర్టీసీ బస్సును దుండగుడు ఎత్తుకెళ్లి నిజామాబాద్ వైపు తీసుకెళ్లినట్లు సమాచారం. దింతో బస్సు కనిపించకపోవడంతో అప్రమత్తమైన ఆర్టీసీ అధికారులు వెంటనే కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. కోరుట్ల, మెట్‌పల్లి పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బస్సు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం మండలం గండి హనుమాన్ దేవాలయం సమీపంలో బస్సును గుర్తించిన పోలీసులు దానిని స్వాధీనం చేసుకుని, బస్సును చోరీ చేసిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కాకా నిందితుడు బస్సును ఎత్తుకెళుతున్న సమయంలో రహదారిపై వెళ్తున్న క్రమంలో పలువురిని ఢీకొట్టగా ప్రమాదానికి గురయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రభుత్వ సేవల నాణ్యత పెంపే లక్ష్యం



## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి,జూలై–21:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్ధవంతంగా,నాణ్యంగా అందించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్, రామగిరి మండలాల్లో విస్తృతంగా పర్యటించినజిల్లా కలెక్టర్ గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాల, కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం,నూతన తహసీల్దార్ కార్యాలయం,ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియ,పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములు,రామగిరి నూతన తహసీల్దార్ కార్యాలయం,మేడిపల్లి ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గుండారం ఎం.పీ.పీ.ఎస్. పాఠశాల లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి అదనపు బోధన అందించాలని,ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ప్రతి విద్యార్థికి చదవడం,రాయడం,వంటి ప్రాథమిక నైపుణ్యాలు పూర్తిస్థాయిలో అలవడేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు.గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ బోధన, విద్యార్థుల హాజరు,అందుబాటులో ఉన్న మౌలిక వసతులను పరిశీలించి విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు.కమాన్‌పూర్ మండలంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం,మిగిలి ఉన్న చిన్నచిన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 2026 ఆగస్టు1నుంచి కొత్త భవనం నుంచే తహసీల్దార్ కార్యాలయ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.మండలంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్,ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ప్రతి దశను కచ్చితత్వంతో అమలు చేయాలని ఆదేశించారు.పెంచికల్‌పేట్ గ్రామంలోని సింగరేణి భూములను పరిశీలించిన కలెక్టర్,భూ వివాదాల పరిష్కారం కోసం అసిస్టెంట్ డైరెక్టర్ సమగ్ర భూ సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు.కమాన్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లేబర్ రూమ్,వ్యాక్సినేషన్ విభాగాన్ని పరిశీలించారు.ఆసుపత్రి పనితీరును మెరుగుపరచడంతో పాటు ఓపీ సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అన్ని ఆరోగ్య సూచికలను నిర్దేశిత ప్రమాణాల మేరకు అమలు చేయాలని,సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.స్టాప్ డయేరియా కార్యక్రమం ఎన్‌సీడీ కార్యక్రమాలను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సమర్ధవంతంగా అమలు చేయాలని సూచించారు.రామగిరి మండలంలో నిర్మాణంలో ఉన్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.రామగిరి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో ప్రతిపాదిత ఇండస్ట్రియల్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్,పారిశ్రామిక పార్కుకు సంబంధించిన ఫెన్సింగ్ పనులు,అప్రోచ్ రోడ్డు నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో కమాన్ పూర్ తహసీల్దార్ వాసంతి,రామగిరి తహసీల్దార్ సుమన్,ఎంపీడీఓ శైలజారాణి,ఈ ఈ పంచాయతీరాజ్ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ లు వరలక్ష్మి,జగదీశ్,రామగిరి,తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- బ్లాక్‌స్పాట్లలో శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- జాతీయ రహదారులపై ఆక్రమణలు, అక్రమ ప్రవేశ మార్గాలను పూర్తిగా తొలగించాలి
- ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించాలి
- రోడ్డు భద్రతపై రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి నిర్వహించిన వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్

ఖమ్మం, జూలై– 21( ప్రజా కలం న్యూస్) ఖమ్మం జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి జాతీయ రహదారులపై రోడ్డు భద్రతా ప్రమాణాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం రాష్ట్ర రవాణ శాఖ కమీషనర్ ఇల్లంబర్తి హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ రహదారులపై రోడ్డు భద్రత చర్యలు, ప్రమాదాల నివారణ, సుప్రీం కోర్టు మార్గదర్శకాల అమలు, అనుసరణ (కంప్లయన్స్) నివేదికల సమర్పణ, ప్రమాదాల తగ్గింపునకు తీసుకోవాల్సిన చర్యలు, జాతీయ రహదారుల వెంట ఉన్న ఆసుపత్రుల మ్యాపింగ్, ఆక్రమణల తొలగింపు, అత్యవసర స్పందన వ్యవస్థ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, ఖమ్మం పోలీస్ కమీషనరేట్ కార్యాలయం నుండి సిపి సునీల్ దత్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను ఇప్పటికే గుర్తించినవి, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, క్రిటికల్ జంక్షన్లలో అవసరమైన రోడ్డు భద్రతా పనులను తక్షణమే చేపట్టాలని సూచించారు.జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల వెంట వాహనాల కోసం అవసరమైన పార్కింగ్ ప్రాంతాలు, ప్రతి 40 నుంచి 50 కిలోమీటర్ల కు ఒకసారి ప్రజలకుఅవసరమైన పార్కింగ్, మరుగుదొడ్లు, ఇతర వే సైడ్ సదుపాయాల వివరాలతో కూడిన అనుసరణ నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి ట్రాఫిక్ ఉల్లంఘనను నమోదు చేసి నిబంధనల ప్రకారం జరిమానాలు విధించే వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచి, జాతీయ రహదారులపై అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించాలని, అంబులెన్స్ సేవలు కూడా దానికి అనుసంధానమై ఉంచాలని తెలిపారు. జాతీయ రహదారు లకు సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల మ్యాపింగ్ పూర్తిస్థాయిలో ఉండాలని ఆదేశించారు.

జాతీయ రహదారులపై ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, జాతీయ రహదారులకు అక్రమంగా ప్రవేశ మార్గాలు కల్పిస్తున్న దాబాలు, వాణిజ్య సంస్థలు, ఇతర నిర్మాణాలను కేంద్ర జాతీయ రహదారుల చట్టం ప్రకారం తొలగించాలని సూచించారు. జాతీయ రహదారుల సేఫ్టీ జోన్ పరిధిలో ఎలాంటి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిదిద్దేందుకు అందుబాటులో ఉన్న నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని కలెక్టర్ సూచించారు. బ్లాక్‌స్పాట్ల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే సిద్ధం చేసి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఎన్‌హెచ్ఏఐ, రోడ్లు–భవనాల శాఖ అధికారులు ఏటీఎంఎస్ (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టమ్), ఆక్రమణలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ ప్లాన్, లే–బైలు (ఘుఎ–ఎఎవం), వే సైడ్ అమెనిటీస్, బ్లాక్‌స్పాట్లు, తదితర అంశాలపై చేపట్టిన చర్యలకు సంబంధించిన సమగ్ర అనుసరణ నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు.ఇకపై ప్రతి నెల మూడవ శుక్రవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని తప్పని సరిగా నిర్వహించి రోడ్డు భద్రత చర్యల పురోగతిని సమీక్షించాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ ఎస్ఇ యుగంధర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రామారావు, నేషనల్ హైవే పిడి దివ్య, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఓటును కాపాడుకోవాలి

-బిఎల్ ఏ లు క్షేత్రస్థాయిలోనే ఉండాలి -టీపీసీసీ జనరల్ సెక్రెటరీ, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సానెం శ్రీనివాస్ గౌడ్



ప్రజా కలం జులై 21 (గద్వాల ప్రతినిధి) గద్వాల పట్టణం మున్సిపాలిటీ వార్డుల లో పర్యటించిన శ్రీనివాస్ గౌడ్ జోగు లాంబ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు రాజీవ్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని 3, 33, 11, 10, 24 వార్డులలో మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మి నర్సింహులు యాదవ్, డిసిసి వైస్ ప్రెసిడెంట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రామేశ్వరమ్మ ఆధ్వర్యంలో పర్యటించారు.

ఈ సందర్భంగా అబ్జర్వర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పర్యటించడం జరిగిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం సర్ పేరుతో ఓట్లను తొలగించేందుకు కుట్రలు చేసిందని వారి కుట్రలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, బిఎల్ ఏ లు ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉంటూ అర్హులైన ప్రతి ఓటును కాపాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందరూ కలిసికట్టుగా ఏ ఒక్క ఓటును కూడా గల్లంతు కాకుండా, కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని శ్రీనివాస్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బిఎల్ఏలకు, బిఎల్ఓ లకు పలు సూచనలు చేశారు. ఇప్పటి వరకు జరిగిన ఎలిమినేషన్ ఫారంలో పంపిణీ స్వీకరణపై అడిగి తెలుసుకున్నారు. అలాగే డోర్ లాక్, డబుల్ ఓట్లు, మరణించిన వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

బిఎల్ ఏ ల పనితీరుపై, అలాగే కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పనితీరుపై, ఎప్పటికప్పుడు అధిష్టానానికి నివేదిక ఇవ్వడం జరుగుతుందన్నారు.

పట్టణంలోని 24వ వార్డు 224 బూత్ లో 92 శాతం పూర్తిచేసిన బిఎల్ ఓ ను, బి ఎల్ ఏను, మున్సిపల్ అధికారు లను శాలువతో సన్మానించారు

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, నాగులు యాదవ్, మోసిన్, డీసీసీ కార్యదర్శి పూడూరు శ్యామ్, మాజీ పట్టణ అధ్యక్షులు ఇసాక్, నాయకులు కురుమన్న, శ్రీనివాసులు, రిజ్వాన్ ఆయా వార్డుల బిఎల్‌ఏ లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

ప్రతి రైతు ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ముందుకు రావాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ,జులై 20(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): మారుమూల గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ గ్రామంలోని తాగునీటి వసతి, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే వెంటనే నూతన బోరుబావి మంజూరు చేస్తామని తెలిపారు. బోరుబావి ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్‌లు అత్యంత ఉపయోగకరమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని రైతు ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను పరిశీలించి, ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు కొత్తగా ముందుకు వస్తున్న రైతులను అభినందించారు. గ్రామంలో మరిన్ని ఫామ్ పాండ్‌లు ఏర్పాటయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రామంలో టెలికాం సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ శివాజీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరువును జయించేలా ఉద్యాన పంటల సాగుచేయాలి

- జిల్లాలో తీవ్రమైన వర్షపాతం లోటు రైతులకు ఉద్యాన శాఖ అధికారి వై మణి

మల్హర్, జూలై 21 ప్రజాకలం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకుని, రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఉద్యానవన పంటల సాగు ఎంతో లాభదాయకమని డివిజన్ ఉద్యాన శాఖ అధికారి వై.మణి తెలిపారు. మంగళవారం రైతులతో క్షేత్రస్థాయిలో పలు ఉద్యానవన పంటలను పరిశీలించారు. జిల్లాలో ఇప్పటివరకు 30 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఇది ఎల్‌నినో ప్రభావంతో కూడిన కరువు పరిస్థితులను సూచిస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి తరుణంలో రైతులు సాంప్రదాయ పంటల జోలికి వెళ్లకుండా, స్వల్పకాలిక, బహిరంగ పరాగసంపర్క (ఓపెన్ పోలినేటెడ్) రకాలను ఎంచుకోవాలని సూచించారు.లాభదాయకమైన రకాలు ఇవే..టమోటో: సాహూ, అర్క రక్షక్, పూసా రూబీ (ఓపీ)వంకాయ: మంజరి, ఉత్కర్ష, అర్కా నీలకాంత్ (ఓపీ)బెండకాయ: వీబీహెచ్–11, అర్కా అనామిక (ఓపీ)బీరకాయ: అర్క సుమీత్, పూస నస్దర్కాకరకాయ: అర్కా హరిత్ (ఓపీ), పూసా విశేష్ రకాలు అనుకూలమని అన్నారు. నీటి పొదుపుకై డ్రిప్, స్ప్రింక్లర్, మల్చింగ్ విధానాలు



పాటించాలని.ఓపెన్ పోలినేటెడ్, హైబ్రిడ్ రకాలను 70:30 నిష్పత్తిలో సాగు చేయాలని వాతావరణ ఒత్తిడిని తట్టుకోవడానికి పంట నాటిన 30 రోజుల తర్వాత లీటరు నీటికి 5–7 గ్రాముల 19:19:19 ఎన్‌పీకే ఎరువు కలిపి ఆకులపై పిచికారీ చేయాలని కూరగాయల సాగుకు ఎకరానికి రూ.9,600 చొప్పున, మల్చింగ్, పండ్ల తోటల సాగుకు 40% వరకు సబ్సిడీ లభిస్తుంది. ఆసక్తి గల రైతులు జిల్లా ఉద్యానవన కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవన శాఖ డివిజన్ అధికారి వై మణి సూచించారు.

## రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

# పెంచుతానన్న పెన్షన్ ఇవ్వాలి

ఖమ్మం జులై 21( ప్రజా కలం న్యూస్)

ఖమ్మం నగరంలోనే మంగళవారం తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా కమిటీ సమావేశం ఖానాపురం ఆఫీస్ నందు భూక్య మణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు పి ఆర్ దేవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచుతానని చెప్పినటువంటి పెన్షన్ వృద్ధాప్య వితంతు వికలాంగుల ఒంటరి మహిళల పెన్షన్ 4000 మరియు 6000 వెంటనే ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలైనటువంటి పట్టణ పేదలకు దాదాపు 20 సంవత్సరాలుగా కూలీ నాలి చేసుకుని జీవిస్తున్నటువంటి వారికి నిలువ నీడ లేక డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు అప్లై చేసిన కలెక్టర్కు విన్నవించిన ఆర్డిఓ కి విన్నవించిన ఇంతవరకు అర్హులైన వారికి ఇండ్లను కేటాయించలేదని ప్రభుత్వం వెంటనే నిరుపేదలను గుర్తించి వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని కోరారు . ఢిల్లీ జంతర్ మంతర్ లో సోనం వాంగ్చుక్ 21 రోజులుగా ఆమరణ నిరవధిక దీక్షను భగ్నం చేసి హాస్పటల్ కి తరలించినా కూడా ట్రీట్మెంట్ కి సహకరించకుండా వెంటనే కేంద్ర మంత్రిని రాజీనామా చేసే వరకు నాకు ఎటువంటి ఫ్లూయిడ్స్ ఎక్కించవద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే వెంటనే వారి సమస్యను పరిష్కరించాలని అన్నారు . కాక్రోచ్ పార్టీ అభిజిత్ ఢిల్లీ జంతర్ మంతర్లో ప్రజెంట్ ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటే యువత మొత్తం కూడా అక్కడికి చేరి ఢిల్లీ మొత్తాన్ని గడగడ లాడిస్తున్నారు వారి మీద భాష్ప వాయువు ప్రయోగం పోలీసుల లాఠీచార్జి అరెస్టులు వారి ఉద్యమాన్ని ఆపలేకపోతున్నాయి 12 సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం బిజెపి దేశ యువతను టోటల్ వ్యవస్థని నిర్వీర్యం చేస్తున్న పరిస్థితి కనబడతావుంది వారికి ఎటువంటి ఉద్యోగాలు కానీ సరైన భద్రత లేకుండా పోయింది కేంద్ర ప్రభుత్వం ఇకమీదటైనా దేశ యువత మీద దృష్టి సారించకపోతే బిజెపి కనుమరుగైపోతుందని అన్నారు . మహిళలపై దాడులు ఎక్కువవుతున్న ఈ రోజుల్లో సినిమా యాక్టర్ డాక్టరు రాజశేఖర్ సతీమణి జీవిత రాజశేఖర్ సోషల్ మీడియాలో మాట్లాడిన తీరు మహిళలకి అభ్యంతరకరం ఎందుకంటే ఒక భర్త ఎంతమందితోనైనా ఎఫైర్స్ పెట్టుకోవచ్చు వచ్చిన నష్టం ఏంటి వదిలేయాలి అని చెప్పడం మహిళలో కానికి ఆమె ఏమి సందేశం అందిస్తున్నారు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉంది . ఆమె తీరును మార్చుకోవాలని అన్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ వీరనారి మహిళా సంఘం జిల్లా నాయకులు సిహెచ్ సత్యవతి , తిప్పర్తి రమ్య , వరద లలిత , కటకం వెంకటలక్ష్మి , మండల్ భవాని , కోటేశ్వరి , నాగలక్ష్మి , సునీత , రమాదేవి , శ్రీదేవి , ఉపేంద్ర , అనంతలక్ష్మి , భవాని తదితరులు పాల్గొన్నారు .

# ఎస్.ఐ.ఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

## రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 21 :

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. ఈవీడియోకాన్ఫరెన్సులో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్. బి హరిప్రియ, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

## - రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి



నిర్మల్ ,జులై 20(ప్రజా కలం జిల్లా ప్రతినిధి):

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిర్ లో శ్రీ షిర్డిసాయి దీక్షలు ప్రారంభం.

ఖమ్మం జులై 21(ప్రజా కలం న్యూస్ ) ఖమ్మం నగరంలోనే మంగళవారం



గాంధీచౌక్ వరప్రదాత షిర్డిసాయి మందిరం 16వ గురుపౌర్ణమి వేడుకలలో భాగంగా సాయినాధుని భక్తులు సుమారు 300 మంది సాయి మాలాధారణ ను ధరించారు . ఉదయం బాబా వారికి పంచామృత అభిషేకం , గోపూజ , శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో వరప్రదాత శిరిడి సాయి మందిర్ చైర్మన్ డాక్టర్ శ్రీ వేములపల్లి వెంకటేశ్వరరావు , అరవపల్లి నిరంజన్ , పొట్టి వెంకట దుర్గా ప్రసాద్ , కురువెళ్ళ జగన్ మోహన్ రావు , కాకరపర్తి సూర్యనారాయణ , వేములపల్లి శ్రీనివాస్ రావు , వేములపల్లి నరేష్ , గన్నవరపు నాగేశ్వరరావు , కుసుమ శ్రీనివాసరావు , బోనగిరి ఉమేష్ , నోముల శ్రీనివాస్ , నూనె శ్రీనివాసరావు , శీలం హనుమంతరావు తదితర భక్తులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్ నాయకుడు కాంతయ్య మృతి

## - నివాళ్ళు అర్పించిన రాయల, పువ్వాళ్ళ



పాలేరు జులై 21( ప్రజా కలం న్యూస్) కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బందారుపల్లి కాంతయ్య మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో బాధపడుతూ చనిపోయారు. ఈ విషయం తెలుసుకున్న గిడ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ హాఫీజుద్దీన్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్థివదేహం వద్ద పూలగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కాంతయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన మృతి పట్ల సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. కాంతయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాంతయ్య పెద్ద కుమారుడు శ్రీనివాస్ ఇటీవలే ప్రమాదానికి గురై చికిత్స పొందుతుండగా, ఆయన ఆరోగ్య పరిస్థితిని కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోటు లెనిన్, పి. అంజయ్య, బెల్లంకొండ కిరణ్, భూపాల్ రెడ్డి, చంద్రయ్య, విజయ్ పాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యానికి మచ్చ

## పేపర్ లీకేజీపై ప్రశ్నించిన విద్యార్థులపై దాడి

## ఖండనీయం : డా. కొరివిపల్లి శ్రీనివాస్



ఖమ్మం జులై 21( ప్రజా కలం న్యూస్ ఢిల్లీలోని జంతర్ మంతర్ ధర్నా చౌక్ వద్ద పేపర్ లీకేజ్ అంశంపై శాంతియుతంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై లాఠీచార్జ్ జరగడం తీవ్రంగా ఖండనీయమని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు డాక్టర్ కొరివిపల్లి శ్రీనివాస్ (దళితరత్న) పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల లేవనెత్తిన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వారిపై బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించినందుకే ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ వెంటనే రాజీనామా చేయాలని డా. కొరివిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. లాఠీచార్జ్‌లో గాయపడిన విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించి, వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో రాజ్యాంగబద్ధంగా దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. విద్యార్థులపై బలప్రయోగం కాకుండా చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కారం చూపాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

## విశ్వ కోయ-గోండి భాషా పరిరక్షణకు

# ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

ప్రజాకలం ప్రతినిధి ఏటపాక, జూలై 21:

విశ్వ కోయ-గోండి భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలవరం జిల్లా, ఏటపాక మండలం కొత్తూరు-నారాయణపురం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆదివాసి సంక్షేమ పరిషత్, ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆదివాసీ పెద్దలు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన తర్వాత ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూసం శ్రీను మాట్లాడుతూ, కోయ-గోండి భాష కేవలం సంభాషణకు పరిమితమైన భాష మాత్రమే కాదని, ఆదివాసీ జాతి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రకృతి విజ్ఞానం, ఆత్మగౌరవానికి ప్రతీక అని అన్నారు. వేలాది సంవత్సరాలుగా కోయ, గోండ్, కోయదొర తదితర ఆదివాసీ సమాజాలు ఈ భాష ద్వారానే తమ జీవన విధానాన్ని, ఆచార వ్యవహారాలను, జానపద సాహిత్యాన్ని, పండుగలను, ప్రకృతి పరిరక్షణ జ్ఞానాన్ని తరతరాలకు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో మాతృభాషలు కనుమరుగవుతున్న ఈ తరుణంలో కోయ-గోండి భాషను పరిరక్షించడం అత్యవసరమని, మాతృభాషను కోల్పోయిన జాతి తన మూలాలను, చరిత్రను, సాంస్కృతిక వారసత్వాన్ని కోల్పోయినట్లేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోయ భాష పరిరక్షణ కు గ్రామ పటేల్ పూజారులకు, గౌరవ వేతనం ఇవ్వాలని, కోయ భాష ను 8వ షెడ్యూల్ లో చేర్చి గుర్తింపు ఇవ్వాలని అన్నారు. భారత రాజ్యాంగంలోని అధికరణం 29 సాంస్కృతిక, భాషాపరమైన హక్కులకు రక్షణ కల్పిస్తుందని, అధికరణం 350ఎ ప్రకారం పిల్లలకు వీలైనంత వరకు మాతృభాషలోనే ప్రాథమిక విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అధికరణం 350బి భాషా అల్పసంఖ్యాకుల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక అధికారి నియామకాన్ని సూచిస్తుందని వివరించారు. అలాగే జాతీయ విద్యా విధానం-2020 కూడా మాతృభాష ఆధారిత విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గుర్తు చేశారు. ఈ సందర్భంగా



ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కోశాధికారి నాయకులు సూప అనిల్ మాట్లాడుతూ, కోయ-గోండి భాష పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో కోయ మాతృభాష బోధనను విస్తరించాలని, కోయ భాష తెలిసిన ఉపాధ్యాయులను నియమించాలని, కోయ భాషలో పాఠ్యపుస్తకాలు, నిఘంటువులు, వ్యాకరణ గ్రంథాలు రూపొందించాలని అన్నారు. అదేవిధంగా కోయ జానపద గేయాలు, కథలు, సామెతలు, సంప్రదాయ విజ్ఞానాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలని, విశ్వవిద్యాలయాల్లో కోయ-గోండి భాషపై ప్రత్యేక అధ్యయన, పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రతి సంవత్సరం జూలై 21న విశ్వ కోయ-గోండి భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు తమ మాతృభాషను గర్వంగా మాట్లాడాలని, ప్రతి ఆదివాసీ కుటుంబం ఇంటి నుంచే పిల్లలకు కోయ భాషను నేర్పించాలని, భాషను కాపాడడం అంటే జాతి భవిష్యత్తును కాపాడినట్లేనని ఇద్దరు నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులు కోయ-గోండి భాషలో పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలలో పాల్గొన్న వారికి ప్రధాన చేయడం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ "మా మాతృభాష – మా గౌరవం" అనే నినాదంతో కోయ-గోండి భాష పరిరక్షణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి కృష్ణ ఆదివాసి సంక్షేమ పరిషత్తు ప్రధాన కార్యదర్శి కంగాల కోటేశ్వరరావు, టాప్ టెన్ నాయకులు బాడిసే వెంకటేశ్వర్లు పూనెం శ్రీకాంత్ ఉపాధ్యాయులు, పోడియం రత్నరావు, పోడియం శ్రీనివాస్, సున్నం చంద్రయ్య, పీడి కారం కన్నరావు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధాపూర్‌లో డంపింగ్ యార్డు జీవో 641 రద్దు చేయాలని జేఏసీ డిమాండ్

## - రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు

(షాద్‌నగర్, జూలై 21 ప్రజా కలం ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ గ్రామంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం. 641ను వెంటనే రద్దు చేయాలని సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. డంపింగ్ యార్డు ఏర్పాటును వ్యతిరేకించే ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం షాద్‌నగర్‌లోని వేద గ్రాండ్ హోటల్‌లో జేఏసీ తొలి సమావేశం కేంద్ర కమిటీ చైర్మన్ రాంబాల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కమిటీ నిర్మాణంలో స్వల్ప మార్పులు చేస్తూ, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. డంపింగ్ యార్డు ప్రభావానికి గురయ్యే గ్రామాలు, మండలాల్లో స్థానిక కమిటీలను ఏర్పాటు చేసి ప్రజలను ఉద్యమానికి సమాయత్తం చేయాలని తీర్మానించారు.

ఈ సందర్భంగా రాంబాల్ నాయక్ మాట్లాడుతూ, ఒకప్పుడు పచ్చని పంట పొలాలు, కూరగాయల సాగుతో హైదరాబాద్ మహానగరానికి ఆహారం అందించిన ఈ ప్రాంతం డంపింగ్ యార్డు వల్ల కాలుష్యానికి గురై ప్రజల ఆరోగ్యం, వ్యవసాయం తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల సిద్ధాపూర్‌తో పాటు సుమారు 30 కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలు కూడా ప్రభావితమవుతాయని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధికి ఇది పెను సవాలని, ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు.

ఇప్పటికే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు విడివిడిగా ఆందోళనలు నిర్వహిస్తున్న నేపథ్యంలో, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఉమ్మడి పోరాటం సాగించాలనే ఉద్దేశంతో "సిద్ధాపూర్ డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ" ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. సమావేశంలో జేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, అబ్దుల్ రబ్ జామి, వర్కింగ్ చైర్మన్ దొడ్డి శ్రీనివాస్, కన్వీనర్ పినపాక ప్రభాకర్, కో-ఆర్డినేటర్లు తిరుమలయ్య, టీజీ శ్రీనివాస్, కో-చైర్మన్లు సత్యనారాయణ, మోహన్ సింగ్, బుద్దుల జంగయ్య, ఈశ్వర్ నాయక్, పెంటనోళ్ల నరసింహ, బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, బాలస్వామి, రజితతో పాటు కో-కన్వీనర్లు అర్జున్, రవీంద్ర నాథ్, ప్రశాంత్, వి. శ్రీకాంత్, పవన్, సత్యనారాయణ, వర్రప సాద్, బిక్యా నాయక్, శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్టీయూటీఎస్ మాసపత్రిక సబ్ ఎడిటర్‌గా కూనారపు వెంకటరమణకు సన్మానం



ప్రజా కలం ప్రతినిధి భద్రాచలం, జూలై 21 :

టీఆర్టీయూటీఎస్ ప్రాంతీయ కార్యాలయం, భద్రాచలంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కారంపూడి దశమ్ బాబు అధ్యక్షతన నిర్వహించిన భద్రాచలం డివిజన్ ఉపాధ్యాయుల సమావేశంలో టీఆర్టీయూటీఎస్ మాసపత్రిక సబ్ ఎడిటర్‌గా నియమితులైన కూనారపు వెంకటరమణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దశమ్ బాబు మాట్లాడుతూ, కూనారపు వెంకటరమణ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉపాధ్యాయ, విద్యా, సామాజిక సమస్యలపై అనేక ఉద్యమాలు చేపట్టి ఉపాధ్యాయులకు, ప్రజలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. సంఘం పట్ల ఆయన అంకితభావం, సేవా దృక్పథాన్ని గుర్తించి టీఆర్టీయూటీఎస్ మాసపత్రిక సబ్ ఎడిటర్ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. కూనారపు వెంకటరమణ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి సంఘ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఉపాధ్యాయుల సమస్యలను మాసపత్రిక ద్వారా ప్రభుత్వం, సమాజం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం మండల అధ్యక్షుడు దగ్గుపల్లి శ్రీనివాసరావు, ఆర్. నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి టి.వి. సురేష్‌బాబు, పటేల్ లక్ష్మీనారాయణ, పినపాక ఎంఈఓ కొమరం నాగయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రెబ్బ శ్రీనివాసరావు, డి. వెంకటేశ్వర్లురావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## – బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బొడ్డు బాబురావు డిమాండ్

పాలేరు జులై 21(ప్రజా కలం న్యూస్ )



తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నేలకొండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షులు బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ యను జులైలోగా పూర్తిచేసి, ఆగస్టు నుంచి అన్ని సంక్షేమ పథకాలు అమలుచేయాలని సూచించారు. ఉద్యమకారులకు ఇండ్లు లేదా ప్లాట్లు కేటాయించడంతో పాటు నెలకు రూ.25 వేల పింఛన్ హామీని అమలుచేయాలి. స్వాతంత్య్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాటయోధులకు కల్పిస్తున్న తరహాలోనే మలిదశ తెలంగాణ ఉద్యమ కారులకు కూడా అన్నిరకాల సంక్షేమ ప్రయోజనాలు అందించాలి. సకల జనుల సమ్మె, సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న ఉద్యోగుల సేవలను గుర్తించాలి. అమరవీరుల కుటుంబాలకు కూడా తక్షణమే ఉద్యోగావకాశాలు కల్పించాలి. ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు జారీ చేసి.. ఉచిత బస్ పాస్ తో పాటు ఉచిత వైద్యం కల్పించాలి. జార్ఖండ్ లోక దృమకారుల కోసం అమలుచేస్తున్న విధానాన్ని అమలుచేయాలని కోరారు.

# తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ - 1గనిని సందర్శించిన టీజీజెన్కో డైరెక్టర్ బి.నాగియా

## - ఉత్పత్తి పెంపునకు సూచనలు...



మల్హర్, జూలై 21 ప్రజాకలం ప్రతినిధి భూపాలపల్లి జిల్లా లోని తాడిచర్ల కోల్ బ్లాక్ 01 ఓపెన్ కాస్ట్ మైన్ ను మంగళవారం టీజీజెన్కో కోల్ ఎ లాజిస్టిక్స్ డైరెక్టర్ బి.నాగియా సందర్శించారు. ఈ పర్యటనలో ఆయన వెంట టీజీజెన్కో జీఎం పి.మోహన్ రావు, కేటీపీపీ సీఈ ఓఎమ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైన్ సీనియర్ అధికారులు ఏఎమ్మార్ ప్రాజెక్టు హెడ్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ కేఎస్ఎన్ మూర్తి గని యొక్క ప్రస్తుత స్థితిగతులు, బొగ్గు మైనింగ్ ప్రక్రియను డైరెక్టర్‌కు డిజిటల్ ప్రెజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. అనంతరం మైన్ వ్యూ పాయింట్ నుండి గని పనులను పరిశీలించిన డైరెక్టర్ బి.నాగియా, బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు.

# మట్టిలో మాణిక్యం జానపద గీతాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నా రచయిత గాయకుడు ఆకాష్ కేదేవార్



నిర్మల్ జులై 21(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుంటాల మండలంలోని లింబా(కె) గ్రామానికి చెందిన ఆకాష్ ఎమ్మెస్సీ మైక్రోబయాలజీ చదువుతూ తెలంగాణ పల్లె జీవన విధానం, మట్టి పరిమళం, గ్రామీణ సంస్కృతి ప్రతి బింబించేలా రచించిన 'దూరమై పోయావే.. 'దొర సాని.. దొరసాని' 'ఓలమ్మో పెళ్లి' వంటి జానపద గీతాలు యూట్యూబ్ వేదికగా మంచి ఆదరణ పొందుతున్నాయి. రచయితగా గాయకుడిగా రాణిస్తూనే చదువులో కూడ రాణిస్తున్నాడు ఈ మధ్య తాను రాసినటువంటి పుస్తకం నాన్న ఒక నిశ్శబ్ద సముద్రం నిర్మల్ కలెక్టర్ భవేష్ మిశ్రా స్వయంగా చూశారు. పుస్తకం మంచి ఆదరణ పొందుతుంది రాష్ట్రంలో ఉన్న ప్రముఖుల నుండి అభినందనలు పొందుతున్నాడు.

# రిజిస్ట్రేషన్ కార్యాలయాల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని కేటాయించిన ప్రభుత్వం

## ఫరూక్ నగర్ మరియు షాద్ నగర్ రెండు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ముప్పై ఐదు గుంటల భూమి కేటాయింపు

## సంవత్సరం గడువులో శాశ్వత భవనాల నిర్మాణం పూర్తి కావచ్చన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్న ప్రజలు

## కేటాయించిన స్థలాన్ని ఫరూక్ నగర్ తహసిల్దార్ ద్వారా స్థలాన్ని స్వాధీన పరచుకున్న సబ్ రిజిస్టర్ అధికారులు

( షాద్నగర్ జూలై 21 ప్రజా కలం ప్రతినిధి )





రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పరిధిలోని ఫరూక్ నగర్ మరియు షాద్ నగర్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలకు సంబంధించి శాశ్వత భవనాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని భావించిన ప్రభుత్వం ఎట్టకేలకు ప్రజల కష్టాలను తీర్చే దిశలో ముందడుగు వేసి షాద్ నగర్ పాత హైవే పక్కన గల పాత కోర్టు స్థలాన్ని సర్వే నెంబర్ 178 లో 35 గుంటల స్థలాన్ని ఫరూక్ నగర్ తహసిల్దార్ సమక్షంలో స్థానిక ఫరూక్ నగర్ ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ వికాస్ రెడ్డి మరియు షాద్ నగర్ సబ్ రిజిస్టర్ శేషగిరి లకు ఈ రోజు ఉదయం హద్దులు నిర్ణయించి స్థలాన్ని చూయించి వారికి స్వాధీన పరచడం జరిగింది ఈ విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు సంవత్సరం గడువు లోపల భవనాల నిర్మాణాలు పూర్తవుతాయి అన్న ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

# బైలంపూర్‌లో మహిళా సంఘం భవనానికి భూమిపూజ

### మహిళల సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం:21జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం బైలంపూర్ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవనంతో పాటు గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే



నర్సారెడ్డి మంగళవారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సమర్థవంతంగా సాగుతోందని అన్నారు.మహిళల సాధికారతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.మహిళలు ఆర్థికంగా,సామాజికంగా మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతోనే మహిళా సంఘం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలకు నిజమైన అండ లభిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నర్సారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మచ్చల కృష్ణ, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్,వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, ఉప సర్పంచ్ కనకయ్య,వార్డు సభ్యులు నాగరాజు,మణి,పవన్,సురేష్, నరేందర్ నాయక్, మామిడ్యాల సర్పంచ్ ఎడ్ల పోచయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలయ్య యాదవ్,కరుణాకర్ గౌడ్, పెంటమిడి స్వామి,మహిళా సంఘ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి, కార్యకర్తల రక్షణకే మా ప్రాధాన్యత

**- బీజేపీ రాష్ట్ర నాయకులు దారం గురువారెడ్డి**

**-సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తన తీరు మార్చుకోవాలని హితవు**

**- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యం**

గజ్వేల్: 21 జూలై 2026 (ప్రజా కలం ప్రతినిధి)

తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యాలయం నుంచి నోటీస్ రావడం అనేది పూర్తిగా పార్టీ అంతర్గత వ్యవహారమని, ఈ విషయాన్ని అందరూ గ్రహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు దారం గురువారెడ్డి పేర్కొన్నారు.గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గురువారెడ్డి మాట్లాడుతూ ఇటీవల గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసమే నూతన కమిటీని నియమించడం జరిగిందని, తామెప్పుడూ పార్టీకి వ్యతిరేకమైన కార్యక్రమాల్లో పాల్గొనలేదని స్పష్టం చేశారు. బీజేపీ కోసం రాత్రింబవళ్లు శ్రమిస్తున్న నిబద్ధత కలిగిన కార్యకర్తలను కాపాడుకోవలసిన బాధ్యత నాయకులందరిపై ఉ



ందన్నారు.సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ చేస్తున్నామన్నారు.తన తీరు మార్చుకోవాలని సూచించారు. పార్టీ పదవిని అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడటం సరైన పద్ధతి కాదని,ఇకనైనా అటువంటి కార్యక్రమాలను స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.జిల్లా అధ్యక్షుడు స్వార్థ ప్రయోజనాలను పక్కనపెట్టి, పార్టీని కాపాడేందుకు, బలోపేతం చేసేందుకు కృషి చేయాలని హితవు పలికారు. గజ్వేల్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ ఎంతో బలంగా ఉందని,రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులు రాములు,కార్యవర్గ సభ్యులు పవన్ కుమార్, అనంత్ సాయి పాల్గొన్నారు.

### చింతకింది మహేశ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.

దుబ్బాక ప్రజాకలం జూలై 21.

బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధి చింతకింది మహేశ్ మాతృమూర్తి యాదమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు కలిసి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా యాదమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, యాదమ్మ గారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించిన ఎమ్మెల్యే, వారికి ఎల్లప్పుడూ తన అండదండలు ఉంటాయని భరోసా ఇచ్చారు. యాదమ్మ సేవలను స్మరించుకుంటూ ఆమె కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# ఎల్ఐసీ ఏజెంట్లకు స్వంత భవనం కోసం

# ప్రభుత్వ స్థలం కేటాయింపునకు కృషి చేస్తా

**- టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్**

**-లియాఫీ--1964 సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం ఘనంగా నిర్వహణ**







హైదరాబాద్, జూలై 21 (ప్రజా కలం ప్రతినిధి)

భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య ( లియాఫి--1964) సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్ జనరల్ బాడీ సమావేశం హైదరాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఘనంగా జరిగింది. తెలంగాణలోని పాత జిల్లాలైన నిజామాబాద్, మెదక్, సికింద్రాబాద్, నల్గొండ జిల్లాలకు చెందిన 23 బ్రాంచ్‌లు, 14 శాటిలైట్ బ్రాంచ్‌ల నుంచి సుమారు 1,200 మంది జీవిత బీమా ఏజెంట్లు, నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది అయిన భారతీయ జీవిత బీమా సంస్థ అభివృద్ధిలో ఏజెంట్ల పాత్ర అమూల్యమని కొనియాడారు. సికింద్రాబాద్ డివిజనల్ కౌన్సిల్‌కు స్వంత కార్యాలయ భవనం నిర్మించేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రైవేట్ బీమా సంస్థలు వచ్చినప్పటికీ ప్రజల విశ్వాసం ఇప్పటికీ ఎల్ఐసీపైనే ఉందని పేర్కొన్నారు. జాతీయ నాయకుడు కౌటికె విఠల్ తన సహాధ్యాయుడని, ఆయన ఆహ్వానం మేరకే ఈ సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసాచారి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా సికింద్రాబాద్ డివిజన్ యూనియన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి ఏజెంట్ల ఐక్యత దేశానికి ఆదర్శమని, భారతీయ జీవిత బీమా సంస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో ఏజెంట్లు మరింత సంఘటితంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. భారతదేశ నంబర్--1 చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్, లియాఫీ జాతీయ నాయకుడు కౌటికె విఠల్ మాట్లాడుతూ, ఏజెంట్లకు నిరంతర శిక్షణ, వృత్తిపరమైన విద్య, చట్టపరమైన రక్షణ అత్యవసరమన్నారు. ఏజెంట్ల కమిషన్ పరిరక్షణ కోసం లియాఫీ--1964 మరింత బలంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతి కొత్త పాలసీ పథకంలో కమిషన్ శాతం తగ్గించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. అలాగే సికింద్రాబాద్ డివిజన్‌కు స్వంత భవనం నిర్మాణానికి తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మూడేళ్లకోసారి జరిగే ఈ జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మెదక్ జిల్లా సిద్ధిపేట బ్రాంచ్‌కు చెందిన రామస్వామి, ప్రధాన కార్యదర్శిగా నల్గొండ జిల్లా మిర్యాలగూడ బ్రాంచ్‌కు చెందిన గోవింద్ రెడ్డి, కోశాధికారిగా నిజామాబాద్ జిల్లా కామారెడ్డి బ్రాంచ్‌కు చెందిన భాస్కర్ ఎన్నికయ్యారు. సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించి పదవీ బాధ్యతలు అప్పగించారు.ఈ సమావేశంలో లియాఫీ --1964 అఖిల భారత కోశాధికారి శ్రీరామ్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎల్ఐసి సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహూ, మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాద్ రావు, సి ఎల్ ఐ ఏ విభాగం అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ ప్రభాకర్, జాతీయ, జోనల్, డివిజనల్ నాయకులు, వివిధ బ్రాంచ్‌లకు చెందిన ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో లియాఫీ--1964 అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎస్.బి. శ్రీనివాసాచారి, అఖిల భారత కోశాధికారి శ్రీరామ్, జాతీయ నాయకుడు కౌటికె విఠల్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎల్ఐసి సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహూ, మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాద్ రావు, సి ఎల్ ఐ ఏ విభాగం అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ ప్రభాకర్ ఉపన్యసించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య--1964 అఖిల భారత కోశాధికారి శ్రీరామ్, సౌత్ సెంట్రల్ జోన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, ఎల్ఐసి సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ ప్రభాత్ కుమార్ సాహూ, మార్కెటింగ్ మేనేజర్ ఎం. ప్రసాద్ రావు, సి ఎల్ ఐ ఏ విభాగం అసిస్టెంట్ డిప్యూటీ మేనేజర్ ప్రభాకర్, జాతీయ నాయకులు ఇంద్రారెడ్డి, కట్ట వెంకటరెడ్డి, రాజేష్, హేమలత, రామచంద్రారెడ్డి, కిషోర్, చందు, యాదగిరిరెడ్డి, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.అలాగే జోనల్ నాయకులు బుడిగ వెంకటయ్య, దోమకొండ సురేందర్, పుల్లెంల శ్రీనివాస్ గౌడ్, బండి వజ్రారెడ్డి, కప్పోజు సూర్యనారాయణ, పుట్ట వెంకన్న, నాయని రాములు, రాపోలు వెంకటేశ్వర్లు, ఎన్. అమరేందర్ రెడ్డి, ఆవిరినేని విజయలక్ష్మి, ఆకునూరి రాణి, పద్మజ, బి.వి.ఎల్. కాంతారావు, గండు సత్యనారాయణ, ఎ. వీరారెడ్డి, కొండె నరసింహ, రాపోలు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. వరంగల్ డివిజనల్ కౌన్సిల్ అధ్యక్షులు పులి సుధాకర్, కరీంనగర్ డివిజనల్ కౌన్సిల్ అధ్యక్షులు ప్రభాకర్ రావు కూడా సమావేశంలో పాల్గొని నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.




# 30 రోజుల్లో ప్లాస్టిక్ రహిత గ్రామాల లక్ష్యం.

**- రాయపోల్ మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సమగ్ర సమీక్ష.**

**- బెల్ట్ షాపులపై ఉక్కుపాదం. -నీటి వృథాను అరికట్టాలని ఆదేశం.**

**- కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచన.**

దుబ్బాక ప్రజాకలం జూలై 21.

రాయపోల్ మండల రైతు వేదికలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి జిల్లా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రభుత్వ సేవలు, వివిధ శాఖల పనితీరు, పెండింగ్ సమస్యలు, వాటి పరిష్కారంపై శాఖల వారీగా సమీక్షించారు. ప్రతి శాఖ అధికారి తమ పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై వివరాలు సమర్పించగా, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

సమావేశంలో గ్రామాలను 30 రోజుల్లో ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించి ప్రత్యామ్నాయ వస్తువులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బక్కి వెంకటయ్య ప్రత్యేక ప్రతిజ్ఞ చేయించారు. గ్రామాల్లో అక్రమంగా కొనసాగుతున్న బెల్ట్ షాపులను వెంటనే మూసివేయాలని, మద్యం అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా చర్యలు చేపట్టాలని, యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తాగునీటి సమస్యలపై సమీక్షిస్తూ, నల్లాల ద్వారా నీరు వృథా కాకుండా ప్రతి గ్రామంలో గేట్ వాల్వులు ఏర్పాటు చేసి లీకేజీలను వెంటనే నివారించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాగునీటి అంశంలో ఉప్పరపల్లి, కిష్టాపూర్, రామాయంపేట కెనాల్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కాలువల్లో పూడిక, చెత్త తొలగించి రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిపై ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేదని విమర్శించారు. పెండింగ్ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేసి వెంటనే పూర్తి చేయాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.



# డాక్టర్ కీర్తన యాదవ్‌కు జాతీయ పురస్కారం

**-సేవతో శిఖరాగ్రానికి**

**-ఐఎంఏ జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకున్న తెలంగాణ యువ వైద్యురాలు**

కూకట్ పల్లి, జులై 21, ప్రజా కలం ప్రతినిధి:

వైద్య సేవలను ప్రజాసేవతో మేళవించి సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందిన తెలంగాణ యువ వైద్యురాలు డాక్టర్ ఎన్ కీర్తన యాదవ్ ప్రతిష్ఠాత్మక భారత వైద్యుల సంఘం (ఐఎంఏ) జాతీయ సామాజిక సేవా పురస్కారం అందుకొని రాష్ట్రానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చారు. చిన్న వయసులోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆమె సేవలకు లభించిన విశిష్ట గౌరవంగా నిలిచింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వందలాది నామినేషన్లను పరిశీలించిన అనంతరం, సామాజిక సేవలో విశేష కృషి చేసిన కేవలం 25 మంది వైద్యులను మాత్రమే ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. ప్రతి రాష్ట్రం నుంచి ఒక్కో వైద్యుడికి మాత్రమే అవకాశం లభించగా, తెలంగాణ నుంచి డాక్టర్ కీర్తన యాదవ్ ఎంపిక కావడం రాష్ట్ర వైద్య రంగానికి గర్వకారణంగా నిలిచింది. న్యూఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన జాతీయ పురస్కార ప్రదానోత్సవంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చేతుల మీదుగా ఆమె ఈ గౌరవాన్ని అందుకున్నారు. దేశ నలుమూలల నుంచి ఎంపికైన ప్రముఖ వైద్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన యాదవ్ సేవలను భారత వైద్యుల సంఘం ప్రత్యేకంగా ప్రశంసించింది. ప్రస్తుతం ఉస్మానియా వైద్య కళాశాలలో మత్తుమందు వైద్య విభాగం (అనస్థీషియాలజీ)లో సహాయ ఆచార్యురాలిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కీర్తన యాదవ్, మరోవైపు డాక్టర్ నారి సేవా ట్రస్ట్ వ్యవస్థాపకురాలిగా అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. ఉచిత వైద్య శిబిరాలు, ప్రాణరక్షణకు ఉపయోగపడే గుండె-శ్వాస పునరుద్ధరణ (సీపీఆర్) శిక్షణ, మహిళల ఆరోగ్య పరిరక్షణ, యువతలో ఆరోగ్య చైతన్యం, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య సహాయం వంటి కార్యక్రమాల ద్వారా వేలాది మందికి చేరువయ్యారు. వైద్య సేవను ఆసుపత్రి గోడలకే పరిమితం చేయకుండా, సమాజంలో ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న డాక్టర్ కీర్తన యాదవ్‌కు ఈ జాతీయ పురస్కారం దక్కడం ఆమె సేవలకు దేశస్థాయిలో లభించిన గుర్తింపుగా వైద్య రంగ ప్రముఖులు పేర్కొంటున్నారు.వైద్య వృత్తిలో నిబద్ధత, సామాజిక సేవలో అంకితభావం, ప్రజల పట్ల బాధ్యత కలిసివస్తే ఎంతటి ఉన్నత స్థాయికి చేరుకోవచ్చో డాక్టర్ కీర్తన యాదవ్ మరోసారి నిరూపించారు. ఆమె సాధించిన ఈ గౌరవం తెలంగాణకే కాకుండా యువ వైద్యులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని వైద్య, సామాజిక వర్గాలు అభినందిస్తున్నాయి.



# మహిళలకు వెంటనే 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

**కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలుఅల్కా లాంబా ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి**

రంగారెడ్డి జిల్లా, జులై 21,(ప్రజా కలం)

ఈ పార్లమెంటు సమావేశంలోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలుఅల్కా లాంబా,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలుఅల్కా లాంబా అధ్యక్షతన జరుగుతున్న చలో ఢిల్లీ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలు పెట్టకుండా మహిళలకు 33 శాతం బిల్లు పార్లమెంట్లో అమలు చేసి మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అంతవరకు పోరాటం చేస్తామని ప్రభుత్వం అన్ని కుట్రలు చేసిన ఎంతమందిని అరెస్టు చేసిన భయపడేది లేదని వారు అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే అంతవరకు ఉద్యమం ఉధృతం చేస్తూ పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్ పేరుతో కుట్రలు చేస్తుందని మహిళా రిజర్వేషన్లు చేయకుండా అడ్డుకుంటుందని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.



# ఎయిర్పోర్టు కాలనీ బ్రిడ్జి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై నవజాత శిశువు లభ్యం

శంషాబాద్, జులై 21, (ప్రజా కలం)

రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ మండలం ఎయిర్పోర్టు కాలనీ బ్రిడ్జి వద్ద ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డుపై నవజాత ఆడ శిశువును తెల్లటి సంచిలో వదిలివెళ్లిన ఘటన కలకలం రేపింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం నవజాత శిశువు గురించి మంగళవారం నాడు ఉదయం డయల్-100కు సమాచారం అందడంతో ఆర్జీఐఏ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ దొరికిన శిశువుకు ఒకటి నుంచి రెండు రోజుల వయస్సు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే శిశువును శంషాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన సంరక్షణ కోసం అమీర్పేట్లోని శిశు విహార్ కు తరలించారు. శిశువును రోడ్డుప క్కన వదిలివెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ శిశువు గురించి ఎవరికైనా సమాచారం ఉంటే ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



# వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న కృష్ణజింకకు సురక్షితంగా కాపాడిన అటవీశాఖ అధికారులు

గజ్వేల్:21 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామ పరిధిలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో చిక్కుకున్న కృష్ణజింకను అటవీ శాఖ అధికారులు సురక్షితంగా రక్షించారు.మంగళవారం రిమ్మనగూడ గ్రామ పొలాల్లో కృష్ణజింక చిక్కుకుపోయిందనే సమాచారం అందడంతో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వినాయక్




ఆదేశాల మేరకు అటవీ శాఖ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.సమయస్ఫూర్తితో వ్యవహరించిన అధికారులు జింకకు ఎలాంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. స్వల్ప గాయాలు కావడంతో వెంటనే గజ్వేల్ వెటర్నరీ ఆసుపత్రికి తరలించి, డాక్టర్ రమేష్ పర్యవేక్షణలో ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిన అనంతరం కృష్ణజింకను గజ్వేల్‌లోని కల్పకవనం అర్బన్ పార్క్ పెద్ద చెరువు సమీప అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలిపెట్టారు. అటవీ శాఖ అధికారులు సమయానికి స్పందించి అరుదైన వన్యప్రాణిని కాపాడడంపై స్థానికులు అభినందనలు వ్యక్తం చేశారు.



# ఆగస్టు 2న తుక్కుగూడలో జరిగే మహాసభలను విజయవంతం చేయాలి

## జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




శంషాబాద్, జులై 21, (ప్రజా కలం)

ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగబోతున్నాయి ఆ మహాసభల గోడపత్రికలను నేడు శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లు గా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించు కున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు. జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యల పైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు కనీస వేతనాలు 26,000 ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇక్కడ నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే రామస్వామి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ కే చందు యాదవ్ డిహెచ్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె వెంకటస్వామి. జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి మంజుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## - నిర్లక్ష్యంపై కఠిన చర్యల హెచ్చరిక- కలెక్టర్ కె.హేమావతి




సిద్దిపేట జిల్లా ప్రతినిధి:

21జూలై ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లాలో పెండింగ్‌లో ఉన్న శ్రీనిధి రుణాల రికవరీని అక్టోబర్ చివరి నాటికి 100 శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హేమావతి అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐకేపీ, శ్రీనిధి, మెప్మా సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.శ్రీనిధి రుణాలు మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం కల్పించిన గొప్ప అవకాశమని పేర్కొన్న కలెక్టర్, రుణాలు తీసుకున్న మహిళలు అభివృద్ధి చెందుతున్నప్పటికీ వాటి తిరిగి చెల్లింపులో జిల్లా వెనుకబడి ఉ ందన్నారు.రికవరీ తక్కువగా ఉంటే భవిష్యత్తులో జిల్లాకు కేటాయించే రుణాలపై ప్రభావం పడే అవకాశం ఉ ందని హెచ్చరించారు. రికవరీలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అలాగే శ్రీనిధి నిధులను దుర్వినియోగం చేసిన వివోఏలు వారం రోజుల్లోగా చెల్లింపులు చేయకపోతే సేవల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.జిల్లాకు కేటాయించిన ఈ-బైకులు, ఈ-ఆటోలను అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని,అలాగే 125 పీఎం సూర్యఘర్ సోలార్ యూనిట్ల లబ్ధిదారుల ఎంపికను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.మహిళా సంఘాలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని, ఈ-కామర్స్ రంగంలో మహిళలు ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. వ్యాపారం నిర్వహించేందుకు మహిళా సంఘాలు ముందుకు వస్తే అవసరమైన స్థలాలను కేటాయిస్తామని తెలిపారు.చేపల పెంపకం లాభదాయకమైన ఉపాధి మార్గమని పేర్కొంటూ, విబీజీ--రామ్‌జీ పథకం ద్వారా ఫామ్ పాండ్లు నిర్మించి చేపల పెంపకం చేపట్టేలా మహిళలను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య,అదనపు డీఆర్‌డీఓ సుదీర్,మెప్మా పీడీ హనుమంత్ రెడ్డి,రెడ్‌కో జిల్లా మేనేజర్ రవీందర్ చౌహన్, శ్రీనిధి ఆర్ఎం మోహన్ రెడ్డి,జిల్లా మత్స్యశాఖ అధికారి,జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు,జిల్లా సమైక్య ఈసీ సభ్యులు,ఏపీఎంలు,శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలి -జిల్లా పంచాయతీ అధికారి: రవీందర్




సిద్దిపేట:21 జూలై

( ప్రజా కలం ప్రతినిధి)

ఘన వ్యర్థాల నిర్వహణలో సుప్రీంకోర్టు--2026 నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రతి ఇంటి నుంచి వెలువడే చెత్తను తడి, పొడి,హానికరమైన, ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ సూచించారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సిద్దిపేట జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు,శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్లు,వార్డు అధికారులు,శానిటరీ సిబ్బందితో ఘన వ్యర్థాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2016 నిబంధనలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఘన వ్యర్థాల నిర్వహణ--2026 నిబంధనలు ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించిందన్నారు.ప్రత్యేక జాగ్రత్త అవసరమైన వ్యర్థాలైన పెయింట్ డబ్బాలు,పురుగుల మందు సీసాలు, ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, థర్మామీటర్లు,గడువు ముగిసిన మందులు, బ్యాటరీలు, పగిలిన గాజు ముక్కలను ఇతర చెత్తతో కలపకుండా విడిగా సేకరించాలని సూచించారు. చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయడం, కాల్చడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.ప్రతి మున్సిపాలిటీలో వార్డుల వారీగా చెత్త సేకరణ నివేదికలను సిద్ధంగా ఉంచాలని,ప్రతి నెల ఘన వ్యర్థాల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేయడంతో పాటు బల్క్ వెస్ట్ జనరేటర్ల వద్ద కంపోస్టింగ్ లేదా బయోగ్యాస్ తయారీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని తెలిపారు.పట్టణాల్లో చెత్తను వనరుగా మలచాలని, ఎండిన ఆకులతో సేంద్రియ ఎరువులు తయారు చేసి మున్సిపాలిటీ పరిధిలోని చెట్లకు వినియోగించాలని సూచించారు. ఆరుబయట చెత్త వేస్తున్న వారిని గుర్తించి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్,గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, చేర్యాల మున్సిపల్ కమిషనర్ నాగేంద్రతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.ఎంపీవో మల్లికార్జున్ ప్రాజెక్టర్ ద్వారా నూతన ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను అధికారులకు వివరించారు.

# బైలంపూర్‌లో మహిళా సంఘం భవనానికి భూమిపూజ

## మహిళల సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

గజ్వేల్ నియోజకవర్గం:21జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్ నియోజకవర్గం ములుగు మండలం బైలంపూర్ గ్రామంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించనున్న మహిళా సంఘం భవనంతో పాటు గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మంగళవారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన సమర్థవంతంగా సాగుతోందని అన్నారు.మహిళల సాధికారతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.మహిళలు ఆర్థికంగా,సామాజికంగా మరింత బలోపేతం కావాలనే ఉద్దేశంతోనే మహిళా సంఘం భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలు, ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలకు నిజమైన అండ లభిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నర్సారెడ్డి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మచ్చల కృష్ణ, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ మోహన్,వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, ఉప సర్పంచ్ కనకయ్య,వార్డు సభ్యులు నాగరాజు,మణి,పవన్,సురేష్, నరేందర్ నాయక్, మామిడ్యాల సర్పంచ్ ఎడ్ల పోచయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలయ్య యాదవ్,కరుణాకర్ గౌడ్, పెంటమిడి స్వామి,మహిళా సంఘ సభ్యులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





## వ్యక్తిగతంగా ఉన్నత స్థితికి చేరాలన్నా చదువు ఒక్కటే మార్గం

### కూలీల అడ్డాకు అండగా నిలిచిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జులై 21,(ప్రజా కలం)

పేదరికం పోవాలన్నా సమాజంలో మంచి గుర్తింపు రావాలన్నా వ్యక్తిగతంగా ఉన్నత స్థితికి చేరాలన్నా చదువు ఒక్కటే మార్గమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్ఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి



ప్రశాంతి హిల్స్ 58వ డివిజన్ బాలాపూర్ చౌరస్తాలో విశాల్ మార్ట్ పక్కన రైతుల బజార్ ఖాళీగా ఉండటంతో అడ్డా కూలీలు, కార్మికులు కూర్చొనేందుకు, బస చేసేందుకు అనుమతి ఇప్పించాలని కాంగ్రెస్ సీనియర్ నేత సామిడి గోపాల్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా కె ఎల్ ఆర్ క్షేత్ర పర్యటన చేశారు. బాలాపూర్ మంత్రాల చెరువు పక్కన ఖాళీగా ఉన్న రైతు బజారులో అడ్డా కూలీలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వలస కార్మికులకు పనికి వెళ్లే వరకు విడిది ఇవ్వాలని అధికార యంత్రాంగానికి తెలిపారు. రోజువారి కూలీల కోసం రూ.5ల మధ్యాహ్న భోజన పథకం, రైతులు, బీద ప్రజలు కూరగాయాలు అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేత దేప భాస్కర్ రెడ్డి సహా స్థానిక నాయకులు, మహిళా నాయకురాళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సెల నాయకులు, అడ్డా కూలీలు, కార్మికులు పలువురు కిచ్చెన్నగారి వెంట పాల్గొన్నారు.

## చెరువుల రక్షణపై మహిపాల్ ఫోకస్..

### -చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం..

### క్రిమినల్ కేసులు తప్పవు: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి..

పటాన్‌చెరు, జులై 21(ప్రజా కలం) ప్రతినిధి

చెరువుల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హెచ్చరించారు. చెరువుల పరిరక్షిత పరిధి,పూర్తి నీటి మట్టం పరిధిలో ఆక్రమణలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని



అధికారులను ఆదేశించారు. మంగళవారం నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో అమీన్పూర్, పటాన్‌చెరు సర్కిళ్ల పరిధిలోని చెరువుల అభివృద్ధి, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. బీరంగూడలోని పోచమ్మకుంట,దయారాలోని జంగంకుంట చెరువుల సరిహద్దులు ఖరారు చేసి సుందరీకరణ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వడక్పల్లి గ్రామ చెరువు పరిరక్షిత పరిధిలో నిర్మించిన ప్రహరీ గోడను వెంటనే తొలగించి స్థలాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ భీమ్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ బాల గణేష్ పాల్గొన్నారు..

## బీజేపీ ఆధ్వర్యంలో సర్ సహాయక కేంద్రం

### -ప్రతి ఓటరు సర్ కార్యక్రమం పాల్గొనాలి

### -బీజేపీ అధ్యక్షులు బి ఎల్ ఏ 2 పసునూరి బిక్షపతి చారి

మహేశ్వరం, జులై 21(ప్రజా కలం):

మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్ఎంసి 58 ప్రశాంతి హిల్స్ డివిజన్ లో సర్ లో భాగంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఓటర్లుకు ఎన్యుమరేషన్




ఫామ్ లు నింపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ 2 లు పసునూరి బిక్షపతి చారి, ద్యాసని తిరుపతి రెడ్డి. రుద్ర వెంకటేష్. 58 డివిజన్ బి ఎల్ ఏ 2 ఇంచార్జీ ప్రభాకర్ రెడ్డి. మండల చందు. కోట్ల గోపాల్. అందే నత్తయ్య నంపట్ల అనిల్. సురేష్. అరవింద్. బిల్లకంటి వెంకటేష్. పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిక్షపతి చారి మాట్లాడుతూ ఓటు హక్కు మనందరి బాధ్యత అని ప్రతి ఒక్కరూ సర్ లో భాగంగా ఎన్యూమరేషన్ ఫార్మ్లు నింపి ఇవ్వాలని తెలిపారు. ఫామ్ నింపి ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోతారని తెలిపారు.

## విజయానికి ధ్యాన శక్తి..

### -విజయానికి కొత్త దారి చూపిన భరత్ భూషణ్..



పటాన్‌చెరు, జులై 21 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత,మానసిక ప్రశాంతత పెంపొందించాలనే లక్ష్యంతో పటాన్‌చెరువులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విజయ రహస్యం,ధ్యానం అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు .ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ ప్రేరణాత్మక వక్త, పానిపట్ జ్ఞాన మానస్ సరోవర్ అకాడమీ డైరెక్టర్ రాజయోగి బ్రహ్మకుమార్ భరత్ భూషణ్ విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత పెరిగి జీవిత లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని ఆయన తెలిపారు. ప్రధానాచార్యులు ఆర్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ,విద్యార్థుల భవిష్యత్తుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషాకుమారి, అధ్యాపకులు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు..

## ఎస్ఐఆర్ వేగంపై కాంగ్రెస్ ఆదేశాలు..

### -బీఎల్ఏలకు కాంగ్రెస్ హెచ్చరిక.. పనితీరు మెరుగుపర్చాలే!..



పటాన్‌చెరు, జులై 21 (ప్రజా కలం)

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు నియోజకవర్గ ముఖ్య నేతలు,బూత్ స్థాయి ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. అమీన్పూర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశానికి తెలంగాణ పద్మశాలి సహకార సంఘం చైర్మన్ గూడూరు శ్రీనివాస్,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పటాన్‌చెరు కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో,అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా బూత్ స్థాయి ప్రతినిధులు ప్రతిరోజూ తమ పనితీరుపై పార్టీ నాయకత్వానికి సమాచారం అందిస్తూ,ఓటర్లలో అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ అధిష్ఠానం అసంతృప్తికి తావులేకుండా బాధ్యతాయుతంగా పనిచేసి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ ముఖ్య నేతలు,బూత్ స్థాయి ప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొన్నారు..






## మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా వట్టేలా మల్లేష్ యాదవ్ నియామకం

### మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం లక్ష్యం

మహేశ్వరం, జూలై 21,( ప్రజా కలం)

మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మాన్సన్‌పల్లి మాజీ సర్పంచ్ వట్టేలా మల్లేష్ యాదవ్‌ను పార్టీ అధిష్ఠానం నియమించింది. పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా చేపట్టిన మండల స్థాయి నియామకాలలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న వట్టేలా మల్లేష్ యాదవ్ మండల పరిధిలో పార్టీ సంస్థాగత వ్యవహారాల సమన్వయం, గ్రామ, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, పార్టీ కార్యక్రమాల అమలు, కార్యకర్తల సమన్వయం వంటి బాధ్యతలను నిర్వహించనున్నారు. మండల స్థాయిలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేయాలనే ఉద్దేశంతో ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వట్టేలా మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. బూత్ స్థాయి కమిటీలను చురుకుగా తీర్చిదిద్దడం, పార్టీ నాయకత్వంతో సమన్వయం కొనసాగిస్తూ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. నియామకానికి సహకరించిన టీపీసీసీ అధ్యక్షుడు పి. మహేశ్ కుమార్ గౌడ్, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడి నియామకాన్ని



పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు వట్టేలా మల్లేష్ యాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు గొల్లూరి, బీసీ సెల్ కోఆర్డినేటర్ బొల్లు కుమార్, మాజీ ఎంపీపీ అందే నాయక్, వత్తుల రఘుపతి, వర్కల యాదగిరి, రాఘవేందర్ రెడ్డి, సుభాన్‌పూర్ సర్పంచ్ మల్లేష్ ముదిరాజ్, కూన యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ నరసింహ యాదవ్, మంత్రి బాల్‌రాజ్, సంధ్యా నాయక్, శ్రీశైలం, గణేష్, ఏర్పుల గణేష్, శీను, చంద్రమోహన్, ప్రభు నాయక్, ఆకాష్, వినేయ్ తదితరులు పాల్గొన్నారు.

## కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కోర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి

### కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం

### కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి

మహేశ్వరం, జులై 21,(ప్రజా కలం)

కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి చేయడమే నా లక్ష్యం



అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గా లేమూర్ గ్రామం సీనియర్ నాయకులు కోర్పోలు రాణా ప్రతాప్ రెడ్డి ని నియమిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్,జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి,నియోజకవర్గం ఇంచార్జి కిచ్చన్న గారి లక్ష్మా రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు, ఈ సందర్భంగా రాణాప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతనికి కృషి చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంషేమా పథకాలను ప్రజలకు తెలియజేస్తా మన్నారు. ఈ పదవి రావడానికి సహాయం చేసిన రాష్ట్ర నాయకులకు , పీసీసీ నాయకులకు, జిల్లా నాయకులకు, నియోజకవర్గం నాయకులకు, మండలం నాయకులకు, గ్రామ సర్పంచ్ లకు, మాజీ సర్పంచ్ లకు, గ్రామ శాఖ పార్టీ అధ్యక్షులకు, ఇందిరమ్మ కమిటీ చైర్మన్ లకు, సభ్యులకు,నాయకులకు, కార్యకర్తలకు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు మరియు తనపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గం ఇంచార్జి కిచ్చన్న గారి లక్ష్మా రెడ్డి కి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## ఓటు హక్కుపై చైతన్య జ్వాల

### -ఓటరు నమోదుపై ఆదిత్యరెడ్డి దృష్టి..

పటాన్‌చెరు,జులై 21 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలను తెలంగాణ యూత్ ప్రోటోకాల్ చైర్మన్



ఆదిత్యరెడ్డి సందర్శించారు. జేపీ కాలనీ రోడ్ నెం. 3లోని మున్నూరుకాపు ఫంక్షన్ హాల్, ముదిరాజ్ భవన్‌లలో ఏర్పాటు చేసిన ఓటరు సహాయ కేంద్రాల్లో జరుగుతున్న నమోదు ప్రక్రియ, ప్రత్యేక శిబిరాల నిర్వహణ తీరును పరిశీలించారు. ఓటరు నమోదుకు గడువును ఆగస్టు 3 వరకు పొడిగించిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆదిత్యరెడ్డి సూచించారు. 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య బలోపేతంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ప్రజల్లో ఓటు హక్కుపై అవగాహన పెంచేందుకు, కొత్త ఓటర్ల నమోదును సులభతరం చేసేందుకు ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు..

### మహేశ్వరం నియోజకవర్గం సర్ ప్రోగ్రాం అబ్జర్వర్ గా

## హెల్మెటి అమరేందర్ రెడ్డి నియామకం

మహేశ్వరం, జులై 21,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గంలో గల బాలాపూర్ డివిజన్(62) జిహెచ్ఎంసి పరిధిలో మల్లాపూర్ వైఏఆర్ కన్వెన్షన్ హాల్లో మహేశ్వరం నియోజకవర్గం ఇన్ఛార్జి కిచెన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం సర్ ప్రోగ్రాం అబ్జర్వర్ గా నియమితులైన హెల్మెటి అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ డివిజన్ (62) జిహెచ్ఎంసి సర్ ప్రోగ్రాం ఇంచార్జ్ గా వచ్చిన సురేష్ రెడ్డి తో కలిసి బాలాపూర్ డివిజన్ 13 మంది బి ఎల్ ఎ లతో కలిసి సమావేశం ఏర్పరచడం జరిగింది. సర్ ప్రోగ్రాం విధివిధానాలను బిఎల్ఏ లకు వివరించడం జరిగింది. అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ బి ఎల్ ఎ తోపాటు విశ్లేషించి పార్టీ పరంగా పూర్తిగా సహకరిస్తామని అండగా ఉంటామని అమరేందర్ రెడ్డి చెప్పారు. ఇన్చార్జిగా వచ్చిన సురేష్ రెడ్డి మాట్లాడుతూ. బి ఎల్ ఎ తో ఇండివిజువల్ గా మాట్లాడారు. రేపటి నుండి డోర్ టు డోర్ తిరుగుదామని సురేష్ రెడ్డి చెప్పారు. అలాగే బాలాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ గా నూతనంగా నియమితులైన నీరుడు శ్రీరాములు ని షాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ గారు,కార్పొరేటర్ బాలు నాయక్, శివాలయం డైరెక్టర్ పగడాల ఉమేష్ , బి ఎల్ ఎ లు వంగేటి మధుసూదన్ రెడ్డి, గౌరిగే శ్రీశైలం,రావుల లింగం, కొండా శ్రీధర్ రెడ్డి,గుండ్ల కొమురయ్య ,మేకల కిరణ్, గోల్కొండ రాజు, మేకల మహేందర్, చింతపట్ల పవన్ కుమార్, గుండుజు వెంకట చారి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి,రాజు నాయక్ పార్టీ నాయకులు చింతకింది భాను, బోదాస్ రాఘవేంద్ర, తడకల నితీష్ తదితరులు పాల్గొన్నారు.






# రాష్ట్రమంతా అక్రిడిటేషన్లు...

# రాజన్న సిరిసిల్లలో ఎందుకీ జాప్యం?

### ఇతర జిల్లాల్లో 70--80% కార్డులు జారీ... ఇక్కడ 20% కూడా పూర్తి కాకపోవడంపై ఆగ్రహం.

### - భారీ వర్షంలోను “చలో కలెక్టరేట్”తో జర్నలిస్టుల గర్జన

### - అర్హులందరికీ వెంటనే అక్రిడిటేషన్లు ఇవ్వాలని ‘చలో కలెక్టరేట్’లో TUWJ-H143 హెచ్చరిక.

**రాజన్న సిరిసిల్ల, జూలై 21 ( ప్రజా కలం ప్రతినిధి):** రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాల్లో దాదాపు 70 నుంచి 80 శాతం వరకు జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసిన ప్రభుత్వం,రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం కనీసం 20 శాతం కూడా పూర్తి చేయకపోవడం వెనుక కారణమేంటని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (TUWJ-H143)నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించిన ‘చలో కలెక్టరేట్’ కార్యక్రమంలో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామల గట్టు నాయకత్వంలో జిల్లా నలు మూలల నుంచి వచ్చిన జర్నలిస్టులు కలెక్టరేట్‌కు చేరుకుని ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



**రాజన్న సిరిసిల్లపై వివక్ష ఎందుకు..?**

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా మాట్లాడుతూ, రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం అర్హులైన జర్నలిస్టులను నెలల తరబడి నిరీక్షింపజేయడం ఆందోళనకరమన్నారు. ఇతర జిల్లాల్లో దాదాపు 70--80 శాతం వరకు కార్డులు జారీ చేసిన అధికారులు,ఈ జిల్లాలో మాత్రం కనీసం 20 శాతం కూడా పూర్తి చేయకపోవడం వెనుక కారణాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

**బస్సు పాస్ రెన్యువల్‌తో ఇబ్బందులు...**

అక్రిడిటేషన్ కార్డులు లేకపోవడంతో జర్నలిస్టులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అధికారిక గుర్తింపు, ప్రయాణ సౌకర్యాలకు దూరమవుతున్నారని తెలిపారు. శాశ్వత అక్రిడిటేషన్ లేకపోవడంతో ఆరు నెలల్లోనే బస్సు పాస్‌ను పలుమార్లు రెన్యువల్ చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఇది జర్నలిస్టుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

**ప్రజాస్వామ్యానికి మంచిది కాదు...**

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే జర్నలిస్టులు తమ హక్కుల కోసం భారీ వర్షంలోనూ రోడ్డెక్కాల్సి రావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**వినతిపత్రం స్వీకరణ:** ధర్నా విషయం తెలుసుకున్న కలెక్టరేట్ అధికారి అక్కడికి చేరుకుని నాయకుల నుంచి వినతిపత్రాన్ని స్వీకరించారు. సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన కార్యక్రమాన్ని విరమించారు. ధర్నా సందర్భంగా “జై తెలంగాణ.. జై జై తెలంగాణ”, “జోహార్ తెలంగాణ జర్నలిస్ట అమరవీరులు”, “వీ వాంట్ జస్టిస్”, “అర్హులైన ప్రతి జర్నలిస్టుకు వెంటనే అక్రిడిటేషన్ కార్డు ఇవ్వాలి” అంటూ నినాదాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు పరకాల ప్రవీణ్, రేగుల రాంప్రసాద్,రసూల్, సయ్యద్ అలీ, రాపల్లి సంతోష్, సిహెచ్ దేవరాజు, మల్లికార్జున్, కలీం, దేవేందర్, జిల్లా రమేష్, చౌటుపల్లి వెంకటేష్, రియాజ్ గోవిందు వేణు, బట్టు శ్రీనివాస్, ఫహద్, కంటాల విజయ్, పంపరి నాగరాజు, శ్రీకాంత్, రెడ్డి మల్ల సత్యనారాయణ పోతుల గాంధీ బాబు,జింక శ్రీధర్, వసీం, జనగామ రమేష్, పండుగ స్వామి, సలీం, జితేందర్, విష్ణు గంగాధర్, ఆసిమ్, నయిమ్, సదుమల్ల తిరుపతి, పరుపుల నారాయణ ప్రసాద్, సత్యం, రెడ్డి మల్ల నరసయ్య, కృష్ణ, అజర్, గడ్డం రవి, సంతోష్ తదితర పాత్రికేయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం

### 5 లక్షల రూపాయలతో అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన ఉప్పు గడ్డ గ్రామ సర్పంచ్ నేనావత్ రాజు నాయక్

మహేశ్వరం, జులై 21,(ప్రజా కలం)

గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే లక్ష్యం అని ఉప్పు గడ్డ గ్రామ సర్పంచ్ నేనావత్ రాజు నాయక్ అన్నారు. మహేశ్వరం మండలంలోని ఉప్పుగడ్డ గ్రామపంచాయతీలో ఐదు లక్షల రూపాయలతో అండర్ డ్రైనేజీ పనులు సర్పంచ్ నేనావత్ రాజు నాయక్ ప్రారంభించారు. ఉప్పు గడ్డ గ్రామపంచాయతీలో ప్రజల అవసరాల మేరకు మహేశ్వరం నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ శాసనసభ్యుడు కిచ్చన గారి లక్ష్మారెడ్డి సహకారంతో ఐదు లక్షల రూపాయల వ్యయంతో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నేనావత్ రాజు నాయక్ మహేశ్వరం మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు,(జిల్లా ప్రధాన కార్యదర్శి డీసీసీ ) తో పాటు మాజీ జెడ్పిటిసి ఈశ్వర్ నాయక్ ఉపసర్పంచ్ మోహన్ గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ వార్డ్ నెంబర్లు రవీందర్ నాయక్ సరిత శ్రీను నాయక్ శివ నాయక్ పరమేష్ నాయక్ గ్రామ పెద్దలు మాజీ వార్డ్ సభ్యులు మోహన్ నాయక్ దేశ్య నాయక్ తుల్జా నాయక్ సురేష్ హనుమంతు రవీందర్ సురేష్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## అల్మాస్‌గూడలో సర్ సమీక్ష సమావేశం నిర్వహించిన ఏఐసీసీ విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



మహేశ్వరం, జులై 20,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండల కేంద్రం అల్మాస్‌గూడలోని ఏపిఆర్ఆర్ గార్డెన్స్ (గుర్రంగూడ రోడ్) లో నిర్వహించిన సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్ ) కార్యక్రమానికి సంబంధించిన ముఖ్య సమీక్ష సమావేశం విజయవంతంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా నాదర్గుల్ డివిజన్ బి ఎల్ ఓ ఇన్‌చార్జి శ్రీ జ్ఞానేశ్వర్ యాదవ్ హాజరై సర్ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోపు సమర్థవంతంగా పూర్తి చేయడానికి బి ఎల్ ఎ లు, బి ఎల్ ఓ లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ, బూత్ స్థాయిలో పనిచేస్తున్న ప్రతి బి ఎల్ ఏ తమ పరిధిలోని ప్రతి ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలు అందాయా లేదా అనే విషయాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని అన్నారు. సర్ కార్యక్రమం పూర్తి చేసేందుకు ఇంకా కేవలం 13 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉన్నందున, బిఎల్ఓ లతో సమన్వయం చేసుకుని ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్లతో ఫారాలు త్వరితగతిన పూర్తి చేయించి, వాటిని సంబంధిత బి ఎల్ ఓ లకు తిరిగి అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ప్రతి అర్హత కలిగిన పౌరుడికి ఓటు హక్కు అందేలా చూడటం, అనర్హ ఓట్లను గుర్తించి తొలగించడం, పారదర్శకమైన విశ్వసనీయమైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమే సర్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రతి బి ఎల్ ఏ బాధ్యతాయుతంగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాదర్గుల్ డివిజన్ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, నవారు మల్లారెడ్డి, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, పుట్టగల జగన్, దిండు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మి నరసమ్మ, ఐలమ్మ, పుట్టగల భాస్కర్, బాలాపూర్ మండల అధ్యక్షులు రవికాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం..

### బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

బొమ్మలరామారం, జులై 21: (ప్రజా కలం)

నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా, బొమ్మలరామారం మండలం మర్యాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన బాధిత కుటుంబాన్ని మంగళవారం రోజున బీర్ల



అయిలయ్య పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ఆర్థిక సహాయంతో పాటు నిత్యవసర సరుకులను అందజేశారు. జిల్లా అధికారుల తో డబ్బుల విషయంతో పాటు ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన ఈ నిరుపేద కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని వెంటనే అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని అవసరమైన సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర సత్యనారాయణ,పిఎసిఎస్ చైర్మన్ సింగిర్తి మల్లేష్ , మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు యాంజాల కళ, మండల తహసిల్దార్ పి.శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమల కవిత వెంకటేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఫకీర్ సంగీత, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దాసరి సూర్య ప్రకాష్ రెడ్డి,సునీత నాయక్, మాజీ ఎంపీటీసీ మాందాల రామస్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డ్ లో వర్క్ చేసే సివరేజ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి: పి.నారాయణ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) వాటర్‌బోర్డ్ లో పని చేసే సివరేజ్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎవీఔాదీ కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బిలో పని చేసే శివరేజ్ కార్మికుల సమావేశం



సూరారంలో యూనియన్ శివరేజ్ విభాగం అధ్యక్షుడు వాసు గుప్తా ఆధ్వర్యంలో జరిగిన ఈసమావేశానికి ముఖ్య అతిథిలుగా యూనియన్ అధ్యక్షులు నారాయణ హాజరై మాట్లాడుతూ... పర్మినెంట్ ఉద్యోగుల మాదిరిగా అవుట్‌సోర్సింగ్ కార్మికులకు అన్నీ సౌకార్యాలు కల్పించాలని, రెయిన్‌కోట్స్, సబ్బులు, నూనెలు, హ్యాండ్‌వాష్, శానిటైజర్, టవల్స్, యూనిఫారాలు, గ్లౌజులు, బూట్లు, పనిముట్లు, ఇతర పరికరాలన్ని సరాఫరా చేయాలన్నారు. వారాంతపు సెలవులు అదనపు పనికి అదరపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా, ఆరోగ్య భీమా చేయాలన్నారు. ఏజెన్సీ ఈఎస్ఐ, పీఎఫ్ కార్డులు అందజేయలన్నారు. ప్రభుత్వం పెరుగుతున్న ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రమేష్, మహేష్, ప్రవీణ్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ప్రజలపై పోలీసుల దమనకాండను ఖండించండి:సిపిఐ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

ఢిల్లీలో నీట్ పరీక్ష అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమంలో శాంతియుతంగా విద్యార్థులు, యువజనులు, ప్రజాసంఘాల నాయకులు ప్రజలపై పోలీసులు జరిపిన దమనకాండను భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తీవ్రంగా ఖండిస్తోందని సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అన్నారు. అలాంటి నిరసనను బలప్రయోగంతో అణచివేయడం, నిరసనకారులను బలవంతంగా అదుపులోకి తీసుకోవడం, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అభివర్ణించారు. నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై దేశవ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళనలను వ్యక్తం చేశారు. పరిష్కరించాల్సిన కేంద్ర ప్రభుత్వం, వాటిపై స్పందించకుండా నిరసనలను అణచివేయడానికి పోలీసులను ఉపయోగించడం అత్యంత బాధాకరం, ప్రజల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కాదన్నారు. సిపిఐ తరఫున కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలి. పార్లమెంట్ ముట్టడి సందర్భంగా ప్రజలపై దమనకాండకు పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, నిరసనకారులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించాలన్నారు.



# అంగన్వాడీ ఆయమ్మ ఔదార్యం

## పసి పిల్లలకు స్కూల్ బ్యాగ్ ల పంపిణీ

భువనగిరి, జూలై 21:( ప్రజా కలం)

ఆమె చేసేది చిన్న ఉద్యోగం, పిల్లలంటే ఆమెకు ఎంతో ప్రేమ, వారిని బడికి పంపడానికి నిత్యం ప్రయత్నిస్తోంది ఓ అంగన్వాడీ ఆయమ్మ. "సొంత లాభం కొంత మానుకొని




పొరుగు వారికి తోడ్పడవోయి" అన్న మహాకవి గురజాడ అప్పారావు స్ఫూర్తితో అంగన్వాడీ పిల్లలకు స్కూల్ బ్యాగ్ లు పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచిందో అంగన్వాడీ ఆయమ్మ. వివరాల్లోకి వెళితే భువనగిరి మండలం చందుపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మదిర కుమ్మరిగుడెం అంగన్వాడీ కేంద్రంలో "ఆయా" గా పనిచేస్తున్న దంతూరి ప్రేమలత చిన్న పిల్లలకు స్కూల్ బ్యాగులను,బహుమతిగా అందించి పిల్లలను ప్రోత్సహిస్తుంది. స్కూల్ బ్యాగ్ లే కాకుండా పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు మరియు బొమ్మలు ఇచ్చి పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు, ప్రాథమిక పాఠశాలలకు వెళ్ళే విధంగా కృషి చేస్తుంది ఈ అంగన్వాడీ ఆయమ్మ. అంగన్వాడీ ఆయమ్మ ను ఆదర్శంగా తీసుకుని పిల్లలందరూ పాఠశాలకు వెళ్ళే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు మేధావులు, విద్యావేత్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కుమ్మరి గూడెం అంగన్వాడీ ఆయా ప్రేమలత ను అభినందించారు.

# పోలీసులకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం




నిజామాబాద్, జూలై 21;
(ప్రజా కలం ప్రతినిధి)

పోలీస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ నిజామా బాద్ నగరంలో మంగళవారం బ్రిడ్జ్ గ్యాప్ హాస్పిటల్,ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్,మేఘన డెంటల్ హాస్పిటల్, లెజెండ్ డయాగ్నోస్టిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ డ్రైవ్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం నిరంతరం అప్రమత్తంగా ఉండే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి,సమయానికి భోజనం చేయకపోవడం, నిద్రలేమి, నిరంతర డ్యూటీల కారణంగా అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి పోలీసు అధికారి,సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కూడా విధి నిర్వహణలో భాగంగా భావించి క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స చేయడం సాధ్యమవుతుందని, అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం కారణంగా చాలామంది ఆలస్యంగా వైద్యులను సంప్రదిస్తున్నారని చెప్పారు. ముందస్తు స్క్రీనింగ్ ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని,అందుకే ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా చేయించుకోవాలని సూచించారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని ప్రశంసించారు. వైద్యులు అత్యాధునిక పద్ధతులతో పరీక్షలు నిర్వహించి క్యాన్సర్ లక్షణాలు,నివారణ చర్యలు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై విలువైన సూచనలు అందించడం అభినందనీయమన్నారు. ధూమపానం,పొగాకు, గుట్కా,మద్యపానం వంటి ఆరోగ్యానికి హానికరమైన అలవాట్లకు దూరంగా ఉండాలని,సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతిరోజూ వ్యాయామం చేయడం, తగినంత విశ్రాంతి తీసుకోవడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చిన్న ఆరోగ్య సమస్యను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ ఉచిత వైద్య శిబిరం ఐదు రోజులపాటు కొనసాగుతుందని,50 సంవత్సరాలు పూర్తయిన పోలీస్ సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు తప్పకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. శిబిరంలో ఈసీజీ,ఛాతీ ఎక్స్‌రే,ఆర్‌బీఎస్ (రక్తంలో చక్కెర పరీక్ష),ప్రోస్టేట్ స్పెసిఫిక్ యాంటిజెన్ ( పి ఎస్ ఏ) పరీక్షలతో పాటు ఇతర అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్ యాదవ్,పోలీస్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సరళ,ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అమర్ దీపిక, ఆంకాలజిస్టు డాక్టర్ పనస అరవింద్,సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ కార్తీక్, ఆర్ఎంఓ డాక్టర్ రవీంద్రనాథ్,మేఘన డెంటల్ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిత్య తేజ,రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ (అడ్మిన్) ధరణికుమార్,వెల్ఫేర్ విభాగం సతీష్,రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌తో పాటు పోలీస్ శాఖ సిబ్బంది ఉన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బ్రిడ్జ్ గ్యాప్ హాస్పిటల్,ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్,మేఘన డెంటల్ హాస్పిటల్,లెజెండ్ డయాగ్నోస్టిక్స్ యాజమాన్యాలు, వైద్య బృందాలకు పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



# కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి -సిపిఎం డిమాండ్

భుదాన్ పోచంపల్లి జులై 21 (ప్రజా కలం )

కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సిపిఎం మండల పట్టణ కార్యదర్శిలు కోట రామచంద్రారెడ్డి దుబ్బాక జగన్ అన్నారు. నీట్



ప్రశ్నాపత్రం లీకేజ్ వ్యవహారంపై న్యాయం కోరుతూ ఢిల్లీలో శాంతియుతంగా పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విద్యార్థుల యువజనుల సంఘాలపై పోలీసు లాటించార్జ్ చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. యువకుల విద్యార్థుల పైన పోలీస్ లాఠీ చార్జింగ్ నిన్న నిరసిస్తూ పోచంపల్లి పట్టణ కేంద్రంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం రోజున నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల పైన నమోదైన కేసులను వెంటనే ఎత్తివేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని రద్దు చేయాలని లాటి చార్జికు బాధ్యులైన వారిపైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే వారిని అణిచివేసేందుకు పోలీసులు లాటి చార్జి చేయడం ప్రజాస్వామిక స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.యువత విద్యార్థుల పైన బిజెపి సర్కార్ కరకశంగా వివరించిందని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికైనా విద్యార్థుల్లో చర్చించి వారికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. వీరితోపాటు ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సభ్యులు ప్రసాదం విష్ణు, మంచాల మధు,పట్టణ నాయకులు బుగ్గ లక్ష్మయ్య, వడ్డేపల్లి యాదగిరి, నాయకులు అలీ, రజినీకాంత్, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

## : ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్

### అధికారులతో సమీక్ష: నిజామాబాద్ ప్రగతిపై ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ దిశా నిర్దేశం

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) జూలై 21 : నిజామాబాద్ నిజామాబాద్ నగర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని శాసనమండలి సభ్యులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం ఆయన నగర అభివృద్ధిపై కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.ట్రాఫిక్ ఇబ్బందులు,అభివృద్ధి పనులు,తాగునీటి సరఫరా,భూగర్భ డ్రైనేజీ పనులు తదితర అంశాలపై చర్చించి సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నగరంలోని అన్ని ప్రధాన మార్గాలలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని అన్నారు.అవసరమైన చోట వన్ వే అమలు చేయాలని,యూటర్న్ ల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు.ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద రోడ్డు భద్రత నిబంధనలు పక్కగా పాటించేలా వాహన చోదకులకు అవగాహన కల్పిస్తూ,ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా అమలు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు.కాగా, ఆయా ప్రాంతాలలో రోడ్లపై ఏర్పడిన




గుంతలను వెంటనే పూడ్చివేయించాలని చెడిపోయిన రహదారులకు మరమ్మత్తులు చేయించాలని ఆదేశించారు.ప్రస్తుత వర్షాకాలంలో గుంతల వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున ఈ పనులకు తక్షణమే చేపట్టాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పురాతన వాటర్ ట్యాంకులను కూల్చి వేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.పూలాంగ్ చౌరస్తా,ఓల్డ్ ఎల్ఐసి చౌరస్తా తదితర ముఖ్య కూడళ్ళ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులకు అవకాశం లేకుండా సర్కిళ్లను వెడల్పు చేయాలని అన్నారు.ప్రజల సౌకర్యార్థం చేపట్టిన సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ భవన సముదాయాల పనులను, కళాభారతి భవన నిర్మాణ పనులను వేగవంతం చేయించి యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయించాలని సూచించారు.తాగునీటి సరఫరా లో ఇబ్బందులు ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షణ చేయాలని,ఎల్లమ్మ గుట్టలో మంచినీటి ట్యాంకును నిర్మించాలని సూచించారు.

రింగ్ రోడ్డు ప్రతిపాదనలు రూపొందించాలని ఇంటింటికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్లు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో నగర మేయర్ ఉమారాణి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్,వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్,నుడా చైర్మన్ కేశ వేణు అదనపు కలెక్టర్ భుజంగరావు,అదనపు డీసీపీ శుభం నగ్రాలే,ట్రైనీ కలెక్టర్ సురేష్,డీఆర్ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఎల్ నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమం

బొమ్మలరామారం జూలై 21(ప్రజా కలం)

తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలని మండల వ్యవసాయ అధికారి దుర్గేశ్వరి అన్నారు యాదాద్రి భువనగిరి జిల్లా,బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామ రైతు వేదికలో సోమవారం రోజున ఎల్ నినో వాతావరణ పరిస్థితులు,తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు ఆరుతడి పంటలైన జొన్న,రాగి,కంది, పెసర,ఆముదం,పొద్దు తిరుగుడు వంటి పంటలను నీటిని తక్కువ ఉపయోగించుకుని ఎక్కువ దిగుబడి సాధించాలని రైతులకు వివరించారు ఎల్ ని నో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా సాధారణము కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉన్నందున రైతులు పంటల మార్పు విధానాలను ప్రోత్సహించి వరి పంటను తక్కువ విస్తీర్ణంలో వేసుకొని వేరే పంటలు పప్పు దినుసులు, ఆయిల్ ఫామ్,కూరగాయలు, మునగా,పూల మొక్కలు సాగు చేయాలని ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏఈఓ లు సీమ,మౌనిక, ఆదిల్, వరలక్ష్మి,రంగారెడ్డి, ముత్యంరెడ్డి,బాల్ రెడ్డి, పండుగ ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు

# చేనేత కళా ఎంతో వైభవం

## ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ

భుదాన్ పోచంపల్లి జులై 21 (ప్రజా కలం )

తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ మంగళవారం పోచంపల్లి చేనేత కేంద్రాన్ని సందర్శించారు. చేనేత కార్మికుల స్థితిగతులను పరిశీలించేందుకు వచ్చి,చేనేత సహకార సంఘాన్ని సందర్శించి ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా సహకార సంఘం అధ్యక్షులు భారత లవ్ కుమార్ ప్రొఫెసర్ వెంకటనారాయణ ని శాలువాతో సత్కరించారు. పోచంపల్లి చేనేత పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు విధానాల రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ తడక యాదగిరి పాల్గొన్నారు.




# సింధు హాస్పిటల్స్‌తో భాగస్వామ్యంతో ఫార్మసీ విద్యను బలోపేతం చేస్తున్న పుల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ

### - ఫార్మ్.డి విద్యార్థులకు క్రమబద్ధమైన క్లినికల్ శిక్షణతో పాటు ఆసుపత్రిలో ప్రత్యక్ష అనుభవాన్ని అందించేందుకు కుదుర్చుకున్న భాగస్వామ్యం..

హైదరాబాద్, జూలై 21 (ప్రజా కలం ప్రతినిధి)

ప్రస్తుత తరుణంలో అనుభవపూర్వక ఆరోగ్య సంరక్షణ విద్య, రోగి-కేంద్రీకృత ప్రాక్టీస్ వైపు ఎక్కువగా మళ్లుతున్న నేపథ్యంలో.., హైదరాబాద్‌లోని పుల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ (పి.ఆర్.ఐ.పి), తమ ఆధ్వర్యంలోని డాక్టర్ ఆఫ్ ఫార్మసీ (ఫార్మ్.డి), ఫార్మ్.డి (పోస్ట్ బాకలారియేట్) ప్రోగ్రామ్‌లలో చేరిన విద్యార్థులకు క్రమబద్ధమైన క్లినికల్ శిక్షణను అందించడానికి సింధు హాస్పిటల్స్‌తో ఒక అవగాహన ఒప్పందం (MoU) కుదుర్చుకుంది. పుల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ డైరెక్టర్ శ్రీ ఆదిత్య చిలుముల, ప్రిన్సిపాల్ డాక్టర్ వరుణ్ దాసరి సమక్షంలో ఈ ఒప్పందాన్ని ప్రకటించారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులు జనరల్ మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, ప్రసూతి, గైనకాలజీ, సైకియాట్రీ, డెర్మటాలజీ, ఆర్థోపెడిక్స్ విభాగాలలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతూ, ఆసుపత్రి వాతావరణంలో వైద్యులు- ఆరోగ్య సంరక్షణ నిపుణులతో కలిసి పనిచేస్తూ ప్రత్యక్ష క్లినికల్ శిక్షణ పొందేందుకు వీలు కలుగుతుంది. ఈ ఏడాది ప్రారంభంలో... 1500 పడకల మల్టీ-స్పెషాలిటీ ఆరోగ్య సంరక్షణ సంస్థ అయిన సింధు హాస్పిటల్స్‌ను భారత గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ క్వాటర్నరీ కేర్ సెంటర్, స్థానిక-ప్రాంతీయ ప్రజలకు సేవ చేయడానికి అత్యాధునిక వైద్య సాంకేతికత, ఆవిష్కరణలను అనుసంధానించడంపై దృష్టి



పెడుతుంది. ఈ ఒప్పందం ప్రకారం, ఫార్మ్.డి పాఠ్యప్రణాళికలో భాగంగా ఆసుపత్రి ప్రత్యేక శిక్షణా సౌకర్యాలు, క్లినికల్ ప్రిసెప్టర్లు, ఇతర ప్రాక్టీస్ ల కోసం అవకాశాలను అందిస్తుంది. ఫార్మ్.డి విద్య కోసం ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ ఒప్పందం పదేళ్ల కాలానికి కుదిరింది. సింధు హాస్పిటల్స్ క్లినికల్ శిక్షణా వాతావరణం, మౌలిక సదుపాయాలు, మార్గదర్శక మద్దతును అందిస్తాయి, అయితే పుల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ఈ కార్యక్రమం యొక్క విద్యా బోధనను పర్యవేక్షించడంతో పాటు అవసరమైన అధ్యాపకులు, విద్యా మౌలిక సదుపాయాలను అందించడం కొనసాగిస్తుంది. నేటి ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ ఆశించే వైద్య రంగ నైపుణ్యాలు, వృత్తిపరమైన అనుభవంతో ఫార్మసీ పట్టభద్రులను సన్నద్ధం చేసే పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాలను బలోపేతం చేయడంలో ఈ సహకారం మరో ముందడుగు.

# రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

## సంగెం - ధర్మారెడ్డిపల్లి కాలువ కు నీటినీ విడుదల చేసిన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం,ఎమ్మెల్యే కుంభం



వలిగొండ జూలై 21 ప్రజాకలం:కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, నకిరేకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ వేముల వీరేశం,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిలు అన్నారు. 125 కోట్ల వ్యయంతో చేపట్టిన సంఘం ధర్మారెడ్డిపల్లి కాల్వకు నీటిని విడుదల చేసి మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గ రైతాంగం చిరకాలంగా ఎదురుచూస్తున్న శుభ ఘడియ ఆవిష్కృతమైందన్నారు.

ఈసందర్భంగా కాలువ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దాదాపు రూ.125 కోట్ల వ్యయంతో 51 కిలోమీటర్లు పొడవు చేపట్టిన ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 16 నెలల్లోనే సగానికి పైగా పూర్తి చేసి,రైతులకు సాగునీటిని అందించే స్థాయికి తీసుకువచ్చిందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు,తమ ప్రభుత్వం వేగం తీసుకొచ్చి రైతుల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని,ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు నాటికి ధర్మారెడ్డిపల్లి కాలువ నిర్మాణా న్ని పూర్తిస్థాయిలో పూర్తి చేసి,రైతులకు శాశ్వతంగా సాగునీటిని అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలువ పూర్తయిన అనంతరం వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో వ్యవసాయ ఉత్పత్తి పెరగడమే కాకుండా రైతుల ఆర్థికాభివృద్ధికి ఇది ఎంతో దోహదపడు తుందని, పేర్కొన్నారు. ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మారెడ్డిపల్లి కాలువలో నీటి విడుదలతో ఈ ప్రాంత రైతుల చిరకాల నిరీక్షణకు తెరపడిందని, కాలువ పూర్తయిన తర్వాత ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల,గ్రామాల ప్రజా ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,అధికారులు, రైతులు,ఇరిగేషన్ ఈఈ,డిఈ, తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు.

**అధికారులతో సర్పంచ్ వాగ్వాదం**

మంగళవారం సంగెం -ధర్మ రెడ్డిపల్లి కాల్వకు నీటిని విడుదల చేస్తానకు ప్రభుత్వ విప్ వేముల వీరేశం,భువనగిరి ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డిలు వచ్చారు. స్థానిక సర్పంచ్ కు ముందస్తు సమాచారం లేదని,సర్పంచ్ తాడురీ లలిత లింగస్వామి,ఇరిగేషన్ శాఖ అధికారులతో వాగ్వాదానికి దిగారు,



# ఒక హెల్మెట్ ఒక ప్రాణానికి రక్షణ

## ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు,

ఉప్పల్ జూలై 21(ప్రజాకలం న్యూస్)

రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టాన్ని తగ్గించి, ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ వినియోగంపై అవగాహన పెంపొందించేందుకు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోలీస్ కమిషనర్ సుమతి ఆదేశాలు, ట్రాఫిక్-2 డీసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద




మంగళవారం 'హెల్మెట్ బ్యాంక్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాధారణంగా హెల్మెట్ లేకుండా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు చలానా విధిస్తారు. అయితే ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు శిక్ష కంటే చైతన్యానికే ప్రాధాన్యం ఇస్తూ వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను ఆపి,రోడ్డు భద్రతపై అవగాహన కల్పించిన అనంతరం వారి ప్రభుత్వ గుర్తింపు కార్డు (ఐడీ ప్రూఫ్) వివరాలను నమోదు చేసి, హెల్మెట్ బ్యాంక్ నుంచి ఒక హెల్మెట్‌ను తాత్కాలికంగా అందజేస్తున్నారు. హెల్మెట్ తీసుకున్న వాహనదారుడు 24 గంటల్లోపు దానిని తిరిగి పోలీసులకు అప్పగించాల్సి ఉంటుంది. తిరిగి వచ్చిన హెల్మెట్లను శుభ్రపరిచి, అవసరమైన ఇతర వాహనదారులకు అందుబాటులో ఉంచుతూ ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ, "జరిమానా భయంతో కాదు... ప్రాణాల భద్రత కోసం హెల్మెట్ ధరించాలి" అని అన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనుక కూర్చునే ప్రయాణికుడు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని సూచించారు. "ఒక హెల్మెట్... ఒక ప్రాణానికి రక్షణ" అనే సందేశంతో ప్రారంభమైన ఈ హెల్మెట్ బ్యాంక్ కార్యక్రమం చలానాలకే పరిమితం కాకుండా ప్రజల్లో రోడ్డు భద్రతపై బాధ్యతను పెంపొందిస్తూ, హెల్మెట్ ధరించే అలవాటును విస్తరింపజేయడంలో ఆదర్శవంతమైన కార్యక్రమంగా నిలుస్తోంది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ కుమార్, ఏసీపీ సంపత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, గోవర్ధన్, సబ్ ఇన్స్పెక్టర్ మధు సుధన్,ట్రాఫిక్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే తరగతులు..!

**- లక్షల ఫీజులు వసూలు చేస్తూ అడ్మిషన్లు.. మహేశ్వరం గేట్‌లో శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌పై ఆరోపణలు**

**- విద్యాశాఖ అనుమతులు లేకుండానే నిర్వహణపై విద్యార్థి సంఘాల ఆందోళన**

**- అడ్మిషన్ల తర్వాత విషయం తెలిసి తల్లిదండ్రుల్లో ఆందోళన**

**- నోటీసులు జారీ చేసినట్లు ఎంఈఓ.. చర్యలు తీసుకుంటామని హెచ్చరిక**

**- విద్యాసంస్థను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాల డిమాండ్**



మహేశ్వరం, జులై 21 (ప్రజా కలం ప్రతినిధి):

మహేశ్వరం గేట్ సమీపంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్, వశిష్ట కో స్కూల్ విద్యాశాఖ నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేపట్టి తరగతులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై విద్యార్థి సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, సంబంధిత విద్యాసంస్థపై తక్షణమే చర్యలు తీసుకుని సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నాయి.

తల్లిదండ్రులను కార్పొరేట్ విద్య పేరుతో ఆకర్షించి ఒక్కో విద్యార్థి నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం విద్యాసంస్థకు పూర్తి స్థాయి అనుమతులు లేవన్న విషయం బయటపడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం.

విద్యాసంస్థలో తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, భద్రతా ప్రమాణాలు తదితర మౌలిక సదుపాయాలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తింపు, అనుమతులపై స్పష్టత లేకపోతే విద్యార్థుల భవిష్యత్తు, సర్టిఫికెట్ల చెల్లుబాటు వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**నోటీసులు జారీ చేసిన ఎంఈఓ**

ఈ వ్యవహారంపై స్పందించిన మండల విద్యాధికారి (ఎంఈఓ) సంబంధిత విద్యాసంస్థకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే, నోటీసులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు కఠిన చర్యలు తీసుకోకపోవడంపై స్థానికంగా పలు అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



**ఎలాంటి అనుమతులు లేని శ్రీ చైతన్య స్కూల్లో పిల్లలను చేర్పించవద్దు**

మహేశ్వరం ఎంఈఓ కాన్న నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్ళ్ళు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీ చైతన్య, వశిష్ఠ కో స్కూల్స్ విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, అనుమతులు లేని స్కూల్స్ పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు.

మహేశ్వరం
ఎంఈఓ కాన్న నాయక్

# ఎలాంటి అనుమతులు లేని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ను సీజ్ చేయాలి

**- రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ డీఈవో శ్రీ చైతన్య స్కూల్ పై చర్యలు తీసుకోవాలి**

**-టిఎన్ఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవీందర్ చౌహాన్**



మహేశ్వరం గేట్ దగ్గర ఉన్న శ్రీ చైతన్య పాఠశాల కు పర్మిషన్ లేదు అయినా యదేచ్ఛగా కార్పొరేట్ విద్యాసంస్థలు దర్జాగా నడిపిస్తూ ఈ పర్మిషన్ లేని కార్పొరేట్ విద్యా సంస్థలకు వెంటనే ఉన్నత అధికారులు సీజ్ చేయాలని టిఎన్ఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవీందర్ చౌహాన్ కోరారు. జివో నంబర్ 29 ద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యా చట్టం, 1982 ప్రకారం ఉన్నత విద్యా సంస్థల (హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ ) స్థాపన, గుర్తింపు, పరిపాలన మరియు నియంత్రణకు సంబంధించి జారీ చేయబడ్డ నియమాలు రాష్ట్ర విభజన తరువాత ఇవి అవసరమైన మేరకు తెలంగాణలో కూడా వర్తించే చట్టపరమైన ఆధారాల్లో ఒకటిగా పరిగణించబడుతున్నాయి. విద్యాసంస్థలకు ప్రభుత్వ అనుమతి (పర్మిషన్ ) మరియు గుర్తింపు (రికగ్నిషన్ ) పొందే విధానం. మౌలిక సదుపాయాలు, భవనం, తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం వంటి కనీస ప్రమాణాలు. బోధనా సిబ్బంది అర్హతలు నియామకాలకు సంబంధించిన నిబంధనలు. విద్యాసంస్థల నిర్వహణ, పర్యవేక్షణ మరియు ప్రభుత్వ నియంత్రణకు సంబంధించిన నియమాలు. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై గుర్తింపు రద్దు లేదా ఇతర చర్యలు తీసుకునే అధికారాలు. తగిన చర్యలు తీసుకోవాలి




# ఆస్పత్రి సిద్ధం...వైద్యం ఎప్పుడూ.?

**-రూ.300 కోట్ల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సిద్ధం..**

**-మరి ప్రారంభం మాత్రం ఎప్పుడు.?..సీపీఎం డిమాండ్..**

పటాన్‌చెరు జులై 21 (ప్రజా కలం) ప్రతినిధి

రూ.300 కోట్లతో నిర్మించిన పటాన్‌చెరు అత్యాధునిక ప్రత్యేక వైద్యశాలను వెంటనే ప్రారంభించాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కే. రాజయ్య మాట్లాడుతూ, పటాన్‌చెరు,పాశమైలారం పారిశ్రామిక ప్రాంతాల్లో లక్షలాది కార్మికులు పనిచేస్తున్నప్పటికీ అత్యవసర వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, శిగాచి పరిశ్రమ ప్రమాదంలో 54 మంది కార్మికులు మృతి చెందిన ఘటనను గుర్తు చేస్తూ, ఆసుపత్రి అందుబాటులో ఉంటే ప్రాణనష్టం తగ్గేదన్నారు. నిర్మాణం పూర్తై ఏడాది గడిచినా ఆసుపత్రి ప్రారంభం కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శిస్తూ,వెంటనే ప్రారంభించకపోతే సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బి. నాగేశ్వరరావు,ఎం.డి. వాజిద్ అలీ,ఈ. పాండురంగారెడ్డి, చంద్ర కిరణ్ సింగ్,సత్తిబాబు, ప్రదీప్, సదాశివరెడ్డి, విట్టల్, జయకుమార్, సంతోష్ పాల్గొన్నారు..

# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మా నర్సింగ్‌రావు

గజ్వేల్:21 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి)



గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డుకు చెందిన మధునాల చిన్న రాజా గౌడ్ నాలుగు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు. ఈ విషాద ఘటన నేపథ్యంలో గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగ్‌రావు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రవాడ బాలకృష్ణ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్న రాజా గౌడ్ మృతికి వారు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com



# “17వ వార్డులో ప్రమాదకర ఇనుప విద్యుత్ స్తంభాలు తొలగించాలి”

## విద్యుత్ శాఖ ఏఈకి వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగ రావు వినతి

గజ్వేల్:21 జూలై 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 17వ వార్డులో ప్రమాదకరంగా మారిన పాత ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కాంక్రీట్ (సిమెంట్) విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగ్‌రావు విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ)కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,వర్షాకాలంలో పాత ఇనుప విద్యుత్ స్తంభాల కారణంగా ఎర్తింగ్, కరెంట్ లీకేజీ,విద్యుత్ షాక్ వంటి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు.ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యగా ప్రమాదకర స్థితిలో ఉన్న ఇనుప స్తంభాలను తొలగించి,వాటి స్థానంలో కాంక్రీట్ విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కోరారు.రామాలయం సమీపం,పటేల్ బజార్,పాతబస్తీ,చాకలి బస్తీ,గుంటూరు గల్లి,గుంటుపల్లి మెయిన్ రోడ్డు,ఎల్లమ్మ గుడి--సరస్వతి శిశు మందిర్ రహదారి,చిక్కుడు బస్తీ తదితర ప్రాంతాల్లోని పాత ఇనుప స్తంభాలను గుర్తించి వీలైనంత త్వరగా మార్పిడి చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా,సర్దార్ ఖాన్ ఇంటి వద్ద ఇప్పటికే కొత్త కాంక్రీట్ విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదని,వెంటనే కనెక్షన్ కల్పించాలని ఏఈని కోరారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### గోనెగండ్ల పట్టణం లక్ష్మీపేట కాలనీలో

# విద్యుత్ స్థంభాలు, వీధి లైట్ల ఏర్పాటు

గోనెగండ్ల : ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి గోనెగండ్ల పట్టణంలోని లక్ష్మీపేట కాలనీలో చాలా కాలంగా విద్యుత్ స్థంభాలు, వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి వెంటనే స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి విద్యుత్ స్థంభాలు, వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టి కాలనీవాసుల సమస్యను పరిష్కరించారు.రాత్రి వేళల్లో చీకటి కారణంగా మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫలితంగా కాలనీలో విద్యుత్ స్థంభాలు, వీధి లైట్ల ఏర్పాటు పూర్తయి ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగింది.ఈ సందర్భంగా లక్ష్మీపేట కాలనీ ప్రజలు తమ సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే డా. బి.వి. జయనాగేశ్వర రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ గోనెగండ్ల మండల నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు మరియు పలువురు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ ఆర్టీసీ అధికారులు నిజాయితీ

ఆళ్లగడ్డ : ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, భద్రత ఉంటుందని ఆ సంస్థ ఉద్యోగులు రుజువు చేశారు. ఈనెల 18న ఆళ్లగడ్డ నుండి నంద్యాల వెళ్లే బస్సు (ఏపీ21 జెడ్0823)లో వెంకట విష్ణువర్ధన్ రెడ్డి అనే ప్రయాణికుడు ఎక్కారు. బస్ దిగే క్రమంలో విలువైన వస్తువులు ఉన్న బ్యాగును మర్చిపోయారు. బస్ సిబ్బంది ఎంతో నిజాయితీతో బ్యాగును డిపో సెక్యూరిటీ విభాగంలో అప్పగించగా సోమవారం బ్యాగులో ఉన్న ఆధారాల ద్వారా డిఎం సుబ్రహ్మణ్యం సదురు ప్రయాణికుడిని పిలిపించి బ్యాగును అప్పగించారు.

# ప్రమాదమైన తప్పదు ప్రయాణం విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ మండలం కోట కందుకూరు గ్రామానికి వెళ్లే విద్యార్థి బస్సులో పరిమితికి మించి 120 మంది విద్యార్థులు బస్సు ఎక్కడంతో ఏ క్షణాన ఏమి జరుగుతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వాళ్లకు ఆర్టీసీ డిపో అధికారుల నిర్లక్ష్యం విద్యార్థుల ప్రాణాల మీదికి చేస్తున్నదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కోట కందుకూరు గ్రామానికి ఒకే బస్సు ఉండడంతో విద్యార్థులు, విద్యార్థినులు ఒకే బస్సు లో ప్రయాణించాల్సి వస్తున్నది.

# సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పరిశుభ్రత పాటించండి

### - మరిపెడ మండల వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి
### - బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మరిపెడలో ఉచిత వైద్య శిబిరం
### - సుమారు 150 మందికి ఆరోగ్య పరీక్షలు..ఉచితంగా మందులు పంపిణీ

మరిపెడ ప్రజ కలం జూలై 21 : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరిపెడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు.మంగళవారం మరిపెడ గ్రామంలో బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి డాక్టర్ గుగులోత్ రవి, డాక్టర్ కిరణ్ కుమార్ హాజరై ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ వర్షాకాలంలో వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, మరిగించిన నీటిని తాగడం, పోషకాహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను




సంప్రదించాలని ప్రజలకు సూచించారు.శిబిరంలో సుమారు 150 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.రక్తపోటు, మధుమేహం తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించి, తగిన వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి, బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, సహ కోఆర్డినేటర్లు జుజ్జూరి ఉపేంద్ర, గుగులోత్ కవిత, ఆశ కార్యకర్తలు శ్రీదేవి, అనసూర్య, వినోద్, గ్రూప్ సభ్యులు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

### రహదారులపై నిఘా, పహారా వ్యవస్థను బలోపేతం – జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి జులై 21 :

జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతా చర్యల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డి. జానకి తో కలిసి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. రాష్ట్ర రవాణా, రోడ్లు ు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల అమలు, వివిధ శాఖల బాధ్యతలు, సమన్వయ చర్యలపై వివిధ జిల్లాల కలెక్టర్లు, ఎస్.పి లు, కమిషనర్ల తో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారులపై అనధికారికంగా భారీ వాహనాలు నిలిపివేయకుండా కఠిన చర్యలు చేపట్టాలని, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే వాహనాలను నిలపడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులపై ఆక్రమణలను తొలగించడం, అక్రమ నిర్మాణాలను నివారించడం, క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడం, పౌరుల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను బలోపేతం చేయడం, డ్రోన్ సర్వేల ద్వారా ఆక్రమణలను గుర్తించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే జిల్లా స్థాయిలో హైవే భద్రతా టాస్క్ ఫోర్స్‌ను సమర్థవంతంగా పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని, పోలీసు, రవాణా శాఖ, జాతీయ రహదారుల సంస్థ, ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని సూచించారు. జాతీయ రహదారులపై నిఘా, పహారా వ్యవస్థను బలోపేతం చేయడం, అత్యవసర వైద్య సేవలు, రికవరీ వాహనాలు, ట్రక్ లే-బై సౌకర్యాలు, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, తగిన లైటింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు వంటి రహదారి భద్రతా చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను నిర్దేశిత గడువులోగా పూర్తిస్థాయిలో అమలు చేసి, శాఖలవారీగా అనుసరణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

# మల్లారెడ్డి దారెటు?

హైదరాబాద్ : తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డిఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే ఆయనకు వెనుక ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి కనీసం అక్కడి నుంచి



వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పూనిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# గులాబీ గ్రాఫ్ పెరిగినట్టేనా..

హైదరాబాద్ : బీఆర్ఎస్ క్రమంగా తెలంగాణ లో పుంజుకుంటుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే బీఆర్ఎస్ ఎఫెన్స్ లో వెళుతుంది. రేవంత్ ప్రభుత్వంపై విరుచుకుపడుతుంది. అవినీతి ఆరోపణలతో హామీలు అమలు చేయకపోవడంపై నిలదీస్తుంది. వర్గాల వారీగా విభజించుకుని వారిని సమీకరించడంలో కొంత గులాబీ పార్టీ సక్సెస్ అయినట్లు కనిపిస్తుంది. ప్రధానంగా రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని కారు పార్టీ హస్తానికి గురిపెట్టింది. దీంతో బీఆర్ఎస్ క్రమంగా బలం పెంచకుంటుందన్న వార్తలు అధికార పార్టీలో కలవరం రేపుతున్నాయి. ఈ విషయాన్ని సొంత పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చెప్పారు. బీఆర్ఎస్ బలం పుంజుకుంటుందని చెప్పిన ఆమె తర్వాత మాట మార్చినప్పటికీ మీడియాలో అన్న వార్తలు ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రేణుక అన్నారని కాదు కానీ.. ప్రతి ఒక్క కాంగ్రెస్ నేత మనసులో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లు కనపడుతుంది. కేసీఆర్ బయటకు రాకపోయినా.. ఆయనపై చేసే వ్యక్తిగత విమర్శలు కూడా ఆ పార్టీకి సానుభూతిని తెచ్చి పెడుతున్నాయంటున్నారు. దీంతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలపై వరసగా బీఆర్ఎస్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజలను తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తుంది. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావులు జనంలోకి వెళుతున్నారు. వారి పర్యటనలకు కూడా మంచి స్పందన లభిస్తుంది. ఇచ్చిన హామీలను కొన్నింటిని అమలు చేసినా, అమలు చేయని వాటిని ఫోకస్ చేయడంతో పాటు ఎరువులు కొరత, పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, కరువు ఇలాంటి విషయాలన్నీ తమకు అనుకూలంగా మలచుకోవడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయిందనే చెప్పాలి. నిన్న జరిగిన యువ సంగ్రామ సదస్సు కూడా విజయవంతం కావడంతో పాటు కేటీఆర్ తాము అధికారంలో ఉన్నప్పుడు తప్పులు జరిగాయని, వాటిని సరిదిద్దుకుంటామని హుందాగా వ్యవహరించడం కూడా ఒకింత జనానికి చేరువ చేసిందనే చెప్పాలి. మొత్తం మీద కాంగ్రెస్ అప్రతమత్తం కాకుంటే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం అంత సులువు కాదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# రాష్ట్ర చైర్మన్ సత్యనారాయణను కలిసిన వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు..

తల్లాడ జూలై 21 ప్రజా కలం న్యూస్ టీపీసీసీ ఎస్సీ డిపార్ట్ మెంట్ రాష్ట్ర చైర్మన్, మానుకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను రాష్ట్ర ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిశారు. మంగళవారం మానుకొండూరులో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒకరినొకరు బాగోగులు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో టీపీసీసీ ఎస్సీ విభాగం బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు. అనంతరం ఇరువురు రాష్ట్రంలో ఎస్సీ విభాగం బలోపేతం తదితర విషయాల గురించి చర్చించుకున్నారు.

# తల్లాడలో నూతనంగా వంశీ స్వీట్స్ అండ్ బేకరీ షాప్ ప్రారంభం

### సరసమైన ధరలతో బేకరీ ఐటమ్స్, కూరగాయలు అమ్మకాలు



తల్లాడ జూలై 21ప్రజా కలం న్యూస్ తల్లాడలోని మట్టమ్మ హోటల్ పక్కన నూతనంగా ఏర్పాటుచేసిన వంశీ స్వీట్స్ అండ్ బేకరీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా షాపు వద్ద అన్ని రకముల బేకరీ ఐటమ్స్ సరసమైన ధరలకే అమ్మకాలు చేపడుతున్నట్లు తెలిపారు. తాజా పదార్థాలతో పాటు ప్రత్యేక రుచి, శుభ్రతను కలిగిన తాజా ఐటమ్స్ ను ఉంచినట్లు వెల్లడించారు. అంతేకాకుండా పక్కన కూరగాయల షాపులు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూరగాయల మార్కెట్ తో గతంలో ఇక్కడ ప్రత్యేక గుర్తింపు పొందామని, ఇప్పుడు కూరగాయలతో పాటు నూతనంగా బేకరీ ఐటమ్స్ కూడా అమ్ముతున్నట్లు తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలు, చుట్టుపక్క మండలంలోని గ్రామాల వినియోగదారులు, కస్టమర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వంశీ కోరారు.

# రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో రాణించిన తానూర్ ‘డిస్కవరీ డ్రీమ్స్’ విద్యార్థినులు

నిర్మల్, జులై 20(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని మహతీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించిన హనుమ అవార్డ్స్ – రాష్ట్ర స్థాయి కూచిపూడి పోటీల్లో నిర్మల్ జిల్లా తానూర్ లోని ‘డిస్కవరీ డ్రీమ్స్ స్కూల్ , హాస్టల్’ విద్యార్థినులు విశేష ప్రతిభ కనబరిచి అవార్డులు సాధించారు,



పాఠశాలకు చెందిన తాత్విక, అవంతిక, తపస్య, మహంతిక అనే విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొని, తమ అద్భుతమైన నాట్య ప్రదర్శనతో ప్రత్యేక గుర్తింపు పొందారు,విద్యార్థినుల ఈ గొప్ప విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపాల్ వి. పెంటాజీ మరియు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు, విద్యార్థులను అభినందిస్తూ, వారు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు,

# కార్గిల్ విజయ్ దివాస్ ను విజయవంతం చేయండి

### - జులై 26 ఆదివారం రోజున యువకులు పెద్దలు మేధావులు తరలిరండి
### - కార్గిల్ విజయ్ దివాస్ చైర్మన్ గాదే(కార్గిల్) రాంబాబు

మరిపెడ ప్రజా కలం జూలై 21 1999 కార్గిల్ యుద్ధంలో భారతమాత




రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వీరోచితంగా పోరాడి అమరులైన భారత సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ 2026 జూలై 26వ తేదీ ఆదివారం ఉదయం పదిగంటల 30 నిమిషాలకు మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం కార్గిల్ సెంటర్లోని కార్గిల్ స్థూపం వద్ద కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడుతుంది అని కార్గిల్ విజయ్ దివాస్ చైర్మన్ గాదే రాంబాబు అన్నారు పిల్లలనుంచి మొదలుకొని పెద్దలు విద్యార్థులు ఉపాధ్యాయులు మేధావులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అన్నారు మహబూబాద్ జిల్లాకే గర్వకారణమైనటువంటి కార్గిల్ స్థూపం అమరవీరుల త్యాగాలకు శాశ్వతంగా గుర్తుండిపోయే ప్రతీక అన్నారు 2003 సంవత్సరంలో ఈ కార్గిల్ స్థూపాన్ని నిర్మించాం అన్నారు అనంతరం 2005 సంవత్సరంలో కార్గిల్ విజయ్ దివస్ సెలబ్రేషన్ కమిటీని నియమించడం జరిగింది అన్నారు కాశ్మీర్ లోని కార్గిల్ వార్ మెమోరియల్ తర్వాత భారతదేశంలో నిర్మించబడిన రెండవ కార్గిల్ స్థూపం ఇదే కావడం మన రాష్ట్రానికే గర్వకారణం అన్నారు ఈ కమిటీ చైర్మన్గా కార్గిల్ రాంబాబు ఉపాధ్యక్షురాలు లోహి రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ బాలగూరి శ్రీనివాస్ రెడ్డి పెంటయ్య అదేవిధంగా వివిధ మండలాల అధ్యక్షులు ఉన్నారు